

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM


ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 01 | సంచిక: 356 | హైదరాబాద్ | శుక్రవారం | 13-06-2025 | పేజీలు: 08


## ఒక్కొక్కరికి రూ.1 కోటి

ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా గ్రూప్ 1 కోటి ఎక్స్‌గ్రేషియా

టాటా గ్రూప్ ఒక్కొక్కరికి రూ.1 కోటి సహాయం





# అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానం

కుప్పకూలిన అహ్మదాబాద్-లండన్ ఎయిర్ ఇండియా విమానం..

టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల్లోనే కుప్పకూలిన ఫ్లైట్..

టేకాఫ్ తర్వాత సెకన్లలోనే సిగ్నల్ కట్..

విమాన ప్రమాదంలో 242 మంది మృతి

విమానంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాని!

పక్షి ఢీ కొనడం వల్లే ఇంజన్లు ఫెయిల్యూర్..?

## సామాజిక న్యాయంతో కేబినెట్ కూర్పు

ఢిల్లీలో కేవలం కర్ణాటకలో కులగణనపై మాత్రమే చర్చించాం

డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ లేకుండా శాఖలపై చర్చ ఎలా ఉంటుంది?

మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ అభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే ప్రధాన అడ్డంకి అన్న సీఎం



## అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీపడుతుంది

జాతి నిర్మాణంలో పాత్ర వహించాలి

హైదరాబాద్‌లో ఏఐ పార్క్ ఏర్పాటు ప్రకటన

నైతికతతో పనిచేయాల్సిన అవసరం : భట్టి విక్రమార్క



## నేను ఒక్కడినే ఎమ్మెల్యేగా ఉన్నా..

- తెలంగాణలో గొల్లలు, కుర్మలు ఒక్కటే
- గొల్ల, కుర్మల తరుపున నేను ఒక్కడినే ఎమ్మెల్యేగా ఉన్నా
- గొల్ల, కుర్మలకు పార్టీలో, మంత్రి వర్గంలో చాన్స్ ఇవ్వాలి
- మాకు అవకాశాలు ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశాం



## 200 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

ముగిసిన ఏఈఈ శ్రీధర్ ఇంట్లో ఏసీబీ సోదాలు..

కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరెస్ట్

రూ.200 కోట్ల పైచిలుకు అక్రమ ఆస్తులను కలిగి ఉన్నట్టు ఆరోపణ

బుధవారం శ్రీధర్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు

శ్రీధర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించిన ఏసీబీ అధికారులు



## ఇది మార్పా రేవంత్ గారు..? హరీష్ రావు సెటైర్లు

గ్రామ పంచాయతీలకు నిధులు లేక ఇబ్బంది

ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చు లేక తాళాలు అప్పగింపు

ఇది మార్పా? అంటూ రేవంత్‌పై హరీష్ ఎద్దేవా



## నగరం నిద్రపోతున్న వేళ

హైదరాబాద్‌లో పబ్బులు, రిసార్టులు మాటున జరిగేదేంటి..?



## గోదావరిబనకచర్ల ఫస్ట్.. తర్వాత సోమశిలకావేరి లింక్

కేంద్రానికి ఏపీ సర్కారు కొత్త ప్రతిపాదనలు

సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కేంద్ర ప్రభుత్వం..!

కుట్రపూరితంగా నేడు ఢిల్లీలో టాస్క్‌ఫోర్స్ భేటీ

దీనికంటే ముందే జరగాల్సిన కన్సల్టెన్సీ మీటింగ్ వాయిదా

రివర్‌బోర్డులకు పీపీఏకు చేరిన ప్రీ ఫీజబులిటీ రిపోర్టు

వేగంగా పావులు కదుపుతున్న బాబు సర్కారు



## సమస్యలతో చదువులకు స్వాగతం!

సమస్యల సుడిగుండంలో బడులు

ప్రారంభమైన కొత్త విద్యాసంవత్సరం

విద్యార్థులకిచ్చేది జత యూనిఫారమే

ఆందోళన కలిగిస్తున్న ఎన్‌రోల్‌మెంట్

సమీక్షించేందుకు తీరికలేని సీఎం



## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు స్పీడప్

- నాలుగోసారి ప్రణీత్‌రావును విచారించనున్న సిట్
- రేపు ప్రణీత్‌రావును ప్రశ్నించనున్న సిట్ అధికారులు
- ఎల్లుండి ప్రభాకర్‌రావుతో కలిపి మరోసారి ప్రణీత్‌రావును ప్రశ్నించనున్న సిట్



# అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీపడుతుంది

- జాతి నిర్మాణంలో పాత్ర వహించాలి
- హైదరాబాద్‌లో ఏఐ పార్క్ ఏర్పాటు ప్రకటన
- నైతికతతో పనిచేయాల్సిన అవసరం : భట్టి విక్రమార్క

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు జాతీయ స్థాయి CA విద్యార్థుల సదస్సులో భాగంగా ముఖ్యోపన్యాసం ఇచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. "CA అంటే కేవలం ఉద్యోగం మాత్రమే కాదు, ఇది జాతి నిర్మాణంలో భాగస్వామ్యం. దేశ ఆర్థిక ఆరోగ్య భద్రతను చార్టెడ్ అకౌంట్లు సమర్థంగా నిర్వహిస్తున్నారు," అని చెప్పారు. అనంతరం మాట్లాడుతూ, "మీ నిజాయితీయే మీ అత్యంత విలువైన ఆస్తి. టెక్నాలజీ, ఆటోమేషన్ వేగంగా మారుతున్న ఈ యుగంలో నైతికతకు కట్టుబడి ఉండే అవసరం మరింత పెరిగింది. మీరు చేసే ప్రతి పని నిజాయితీ, సమన్యాయం, బాధ్యతను ప్రతిబింబించాలి," అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.

భవిష్యత్ తెలంగాణను ప్రపంచ పటంలో నిలపాలనే లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వం అనేక మేగా పథకాలపై దృష్టిసారించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ముఖ్యంగా, హైదరాబాద్‌ను చార్టెడ్ అకౌంట్లకు ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. "ఇక్కడ AI పార్క్‌ను ఏర్పాటు చేయనున్నాం. IT, ఫార్మా, టెక్స్‌టైల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పార్క్‌ల ద్వారా హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం," అని వివరించారు.

"తెలంగాణ ఈ రోజు దేశంలోని ఇతర రాష్ట్రాలతో కాదు, ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతోంది. రీజినల్ రింగ్ రోడ్, మూసీ రివైటలైజేషన్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల వంటి యోచనలతో తెలంగాణ అభివృద్ధిలో మైలురాళ్లుగా నిలుస్తోంది," అని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు భట్టి విక్రమార్క జ్ఞానాన్ని, నైతికతను రెండు చేతుల్లో పట్టుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చార్టెడ్ అకౌంట్ల కృషి తెలంగాణ రైజింగ్ లో భాగస్వామ్యం కావాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకెళ్లేలా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు.



# నగరం నిద్రపోతున్న వేళ

**హైదరాబాద్‌లో పబ్బులు, రిసార్టులు మాటున జరిగేదేంటి..?**

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ చుట్టూ డేంజర్ జోన్ ఏర్పడింది. సిటీ చుట్టుపక్కల ఉన్న ఫామ్ హౌసులు, రిసార్టుల్లో తరచుగా డ్రగ్స్, రేవ్ పార్టీలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పుడు మంగ్లీ బర్త్ డే పార్టీ రచ్చతో మరోసారి ఈ చర్చ తెరపైకి వచ్చింది. వీటికి తోడుగా సిటీలో పబ్ కల్చర్ ఉండనే ఉంది. నగరం నిద్రపోతున్నవేళ జరిగే కార్యకలాపాలపై ప్రభుత్వం సీరియస్ గా దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది.

హైదరాబాద్ మెట్రోసిటీ. ఇక్కడ పార్టీ కల్చర్ చాలా మామూలు విషయం. నార్మల్ పార్టీలతో ఎవరికీ నష్టం లేదు. అవి పెద్ద ఇష్యూ కూడా కాదు. కానీ పార్టీ కల్చర్ మరింత శృతిమించి డ్రగ్స్ పార్టీలు, రేవ్ పార్టీల స్థాయికి చేరడమే సమస్యగా మారింది. ఇందుకోసం సిటీ చుట్టూ ఉన్న ఫామ్ హౌసులు, రిసార్టులను వాడుకోవడం కొత్త ట్రెండ్ గా మారింది. వీఐపీల దగ్గర్నుంచీ కాస్త డబ్బున్న వారిదాకా.. అందరూ ప్రతి చిన్న సందర్భాన్నీ సెలబ్రేట్ చేసుకోవటానికి పార్టీలే మార్గమని భావిస్తున్నారు. అంతవరకూ ఓకే. కానీ ఈ పార్టీల పేరుతో జరుగుతున్న తంతే.. నగరం నిద్రపోతున్నవేళ.. అందర్నీ ఉలిక్కిపడేలా చేస్తోంది. చేవెళ్ల దగ్గర్లోని త్రిపుర రిసార్ట్ లో సింగర్ మంగ్లీ బర్త్ డే పార్టీని కూడా అందరూ మామూలు పార్టీ అనుకున్నారు. కానీ న్యూసెన్స్ గా ఉందనే ఫిర్యాదుతో అక్కడకు వెళ్లిన పోలీసులకు షాకింగ్ విషయాలు తెలిశాయి. విదేశీ మద్యం బాటిళ్లతో పాటు గంజాయి కూడా వాడుతున్నట్టు అనుమానించిన పోలీసులు.. కొందరికి డ్రగ్ టెస్టులు చేశారు. ఒకరికి పాజిటివ్ రావడంతో.. అది బర్త్ డే పార్టీ కాదు.. డ్రగ్స్ పార్టీ అని తేలిపోయింది. సాధారణ బర్త్ డే పార్టీలో విదేశీ మద్యం, గంజాయి వాడాల్సిన అవసరమేంటని పోలీసులు ప్రశ్నించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే.. ఎంతటివారికైనా లాఠీలు ఉపయోగించి బుద్ధి చెప్పాల్సి ఉంటుందని కూడా హెచ్చరించారు.

ఊరికే పార్టీ చేసుకుంటే ఏముంటుంది. కాస్త కిక్ కావాలంటే డ్రగ్స్ ఉండాల్సిందే అనుకుంటున్నారు. అలా పార్టీలు కాస్తా డ్రగ్స్ పార్టీలవుతున్నాయి. దేశీ లిక్కర్ వాడితే ప్రత్యేకత ఏముందని.. ఫారిన్ లిక్కర్ కు ఓటేస్తున్నారు. కానీ ఎక్సైజ్ శాఖ పర్మిషన్ మాత్రం తీసుకోవడం లేదు. దీంతో కేసులు బుక్కౌతున్నాయి. పార్టీ కిక్కు మరీ ఎక్కువైతే ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. పైగా పార్టీలు పురుషులు, స్త్రీలు కలిసి డాన్సులు చేయడం.. ఎంజాయ్ చేయడం ఫ్యాషన్ గా మారింది. ఇలాంటి పార్టీలే శృతిమించి నేరాలు, ఘోరాలకు దారితీసిన ఘటనలు కూడా గతంలో జరిగాయి. అప్పుడు కూడా పోలీసులు కేసులు పెట్టారు. ఎప్పటికప్పుడు కేసులైతే బుక్కౌతున్నాయి కానీ.. ఈ బ్యాడ్ పార్టీలకు మాత్రం ఫుల్ స్టాప్ పెట్టలేకపోతున్నారు.

అవుటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న ఫామ్ హౌసులు, రిసార్టులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ఇక్కడైతే ఎవరూ పెద్దగా పట్టించుకోరనే అంచనాతో ఉంటున్నారు. అలాగే కాసుల కక్కుర్తితో సిటీకి దూరంగా ఉన్న రిసార్టులు, ఫామ్ హౌసుల మేనేజర్లు కూడా ఇలాంటి పార్టీలకు సహకరిస్తున్నారు. ఏదోలా బిజినెస్ జరుగుతుంది కదా అనే ఆలోచనలో వారుంటున్నారు. ఇలా ఒకరి అవసరం, మరొకరి వ్యాపారం కలిసి ఉభయకుశలోపరిగా బ్యాడ్ పార్టీ కల్చర్ రోజురోజుకీ విస్తరిస్తోంది. ఈ పార్టీల టైమింగ్స్ ను బట్టి కూడా అవే పార్టీలో ఇట్టే చెప్పేయొచ్చనే వాదన కూడా ఉంది. సాయంత్రం ఆరు దాటితే ఓ మాదిరి పార్టీలు.. రాత్రి 8 తర్వాత లిక్కర్ పార్టీలు.. రాత్రి 10 దాటితే డ్రగ్స్ పార్టీలని ఫిక్స్ చేయొచ్చని చెబుతున్నారు. అలాగే మిడ్ నైట్ పార్టీ అన్నారంటే.. కచ్చితంగా రేవ్ పార్టీ అని ఊహించుకోవచ్చని అంటున్నారు. ఏదో సందర్భాన్ని పురస్కరించుకుని ఇచ్చే పార్టీలు కొన్నే. కానీ మనీ కలెక్ట్ చేసి.. ప్లాన్ చేసి మరీ ఏర్పాటయ్యే పార్టీలకు లెక్కే లేదు. ఇలా సిటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో జరుగుతున్న బ్యాడ్ పార్టీలు.. అసాంఘిక కార్యకలాపాలకు ఊతమిస్తున్నాయి. ఈ డిమాండ్ ను క్యాష్ చేసుకోవటానికి రిసార్టులు, ఫామ్ హౌసులు కూడా బ్యాడ్ పార్టీలకు సెపరేట్ రేటు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పోలీస్ ప్రాబ్లమ్ రాకుండా తాము చూసుకుంటామని హామీ ఇచ్చే కొన్ని రిసార్టులు కూడా లేకపోలేదు. అయితే ఎంత జాగ్రత్తపడినా.. ఏదోరకంగా పోలీసులకు ఉప్పందుతోంది. అడ్డంగా బుక్కైపోతున్నారు. ఇంతవరకూ బాగానే ఉంటోంది. కానీ కేసు బుక్కయ్యాకే అసలు కథ మొదలవుతోంది. కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరికలే కానీ.. రోజులు గడిచేకొద్దీ ఇలాంటి కేసులు నీరుగారిపోతున్నాయి. నిందితులు కూడా కొన్నిరోజుల కస్టడీ తర్వాత బెయిల్ పై విడుదలౌతున్నారు. అంతే కానీ బ్యాడ్ పార్టీ కేసుల్లో కఠిన శిక్షలు పడుతున్న సందర్భాలు అరుదుగా ఉంటున్నాయి. దీంతో కేసులు బుక్కైనా.. ఏదోలా బయటపడొచ్చనే ధీమాతో రిసార్టులు, ఫామ్ హౌసుల్లో బ్యాడ్ పార్టీలకు బరితెగిస్తున్నారు.

ఎక్కువ పార్టీలు వీకెండ్ లోనే జరుగుతాయి. దీంతో వీకెండ్స్ లో బ్యాడ్ పార్టీలకు సహకరించే రిసార్టులు, ఫామ్ హౌసులకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. సిటీ శివారులో చాలావరకు ఫామ్ హౌసులు ఖాళీగానే ఉంటాయి. ఇదే అదనుగా వీటిని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేస్తున్నారు. అసలు యజమానులు ఎక్కడో ఉండటంతో.. వారు ఇక్కడో వాచ్ మెన్ ను పెడతారు. అసలు యజమానుల పర్యవేక్షణ అంతగా లేకపోవడమే బ్యాడ్ పార్టీలకు అడ్వాంటేజ్ గా మారుతోంది. ఫామ్ హౌస్ అయితే వాచ్ మెన్ ను, రిసార్ట్ అయితే మేనేజర్ ను మేనేజ్ చేస్తే చాలు. పార్టీ పేరుతో ఏం చేసినా అడిగేవాడుండడు. సిటీలో జరిగే పార్టీలు కొంతవరకు లిమిట్‌లో ఉంటాయి. ఇక్కడ బాగా పలుకుబడి ఉన్నవారే బరితెగించే అవకాశం ఉంటుంది. కానీ రిసార్టులు, ఫామ్ హౌసుల్లో అలా ఉండదు. ఎక్కువమంది దృష్టిలో పడమనే ఉద్దేశంతోనే ఇక్కడ పార్టీలు పెడతారు. ఎవరూ గమనించడం లేదనే ధీమాతో.. ఇక్కడ అందరూ రెచ్చిపోతారు. ఏం చేసినా, ఎలా ఎంజాయ్ చేసినా ఎవరికీ తెలియదనే ఊహే.. వీరిని మత్తులో ముంచేస్తోంది. అడపాదడపా పోలీస్ కేసులు నమోదైనా.. చాలా వరకు పార్టీలు రహస్యంగానే జరుగుతున్నాయి. అసలు అక్కడ ఏం జరుగుతుందో తెలియనంతగా బ్యాడ్ పార్టీల్లో ఫుల్లుగా ఎంజాయ్ చేస్తున్నారు. అదేమంటే వీక్ అంతా పడ్డ స్ట్రెస్ కు.. ఇలాంటి పార్టీలే రిలీఫ్ ఇస్తాయని కూడా కొందరు నిస్సిగ్గుగా చెబుతున్నారు. అసలు తాము అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నామనే స్పృహ కూడా చాలా మందికి ఉండటం లేదంటే నమ్మాల్సిందే.

బ్యాడ్ పార్టీల్లో డ్రగ్స్ పార్టీలు ఓ రకమైతే.. ఇక రేవ్ పార్టీలు వీటన్నింటికీ పీక్స్. రేవ్ పార్టీల్లో ప్రధానం మ్యూజిక్, లైటింగ్. మిణుకుమిణుకు అంటూ.. వచ్చే లైట్లలో డ్యాన్స్ చేస్తూ.. ఎంజాయ్ చేస్తారు. ఎలక్ట్రిక్ ట్రాన్స్ మ్యూజిక్, లైటింగ్, లేజర్ షోలు, ప్రొజెక్టెడ్ ఇమేజ్‌లు, విజువల్ ఎఫెక్ట్‌లు, ఫాగ్ మెషీన్లు ఉంటాయి. రేవ్ పార్టీలో ఉపయోగించే.. డీజే సౌండ్ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. డ్రగ్స్ తీసుకుని.., అమ్మాయిలు, అబ్బాయిలు మ్యూజిక్ లో మునిగిపోతారు. ఇష్టం వచినట్టు డ్యాన్సులు చేస్తారు. రేవ్ పార్టీలు 24 గంటల నుంచి మూడు రోజుల వరకూ కూడా జరుగుతుంటాయి. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం.. చేస్తారు. వీళ్లు పార్టీ చేసుకోవాలని అనుకున్నప్పటి నుంచి.. కోడ్ లాంగ్వేజ్ లోనే మాట్లాడుకుంటారు. పోలీసులకు అనుమానం రాని ప్రదేశాలను ఎంపిక చేసుకుంటారు. ఫుడ్, కూల్‌డ్రింక్స్, ఆల్కహాల్, సిగరెట్లు కాకుండా.. కొకైన్, హషీష్, చరాస్, ఎల్ఎస్‌డి, మెఫెడ్రోన్, ఎక్స్టసీ లాంటి డ్రగ్స్ కూడా ఉంటాయి. కొన్ని రేవ్ పార్టీలలో సెక్స్ కోసం రూమ్స్ కూడా ఉంటాయని చెబుతారు. రేవ్ పార్టీలను చాలా రహస్యంగా ఉంచుతారు. మాదకద్రవ్యాలు తీసుకునేవారికి, విక్రయించేవారికి చాలా సేఫ్ ప్లేస్ గా భావిస్తారు.



వీకెండ్ విచ్చలవిడి సంస్కృతి పెరిగిపోతోంది. మందు, చిందుతో యువత రెచ్చిపోతోంది. రేవ్ పార్టీల పేరిట బ్యాడ్ కల్చర్ పంజా విసురుతోంది. భారీగా జీతాలు అందుకుంటూ.. వీకెండ్ లో రెండు రోజులు సరాదాగా గడుపుదామనుకునే వారి సంఖ్య రోజురోజుకీ ఎక్కువవుతోంది. మందేస్తూ, డ్రగ్స్ తీసుకుంటూ తమను తాము మరచిపోయి.. అసలు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితుల్లో చాలామంది తమ జీవితాలను చిద్రం చేసుకుంటున్నారు. ఇదివరకు రేవ్ పార్టీ అంటే.. అబ్బో అది పెద్దోళ్లకు సంబంధించిన వ్యవహారం అనుకునేవారు. కానీ మారుతున్న కాలంతో పాటు జీవనశైలి కూడా మారుతోంది. ఏదో ఎంజాయ్ చేయాలనే ఆరాటం యువతను ఒక్క దగ్గర నిల్చోనివ్వడం లేదు. దానికి తగ్గట్టుగా పెద్ద జీతాలు వారిని కుదురుగా ఉండనివ్వడం లేదు. అందుకే మస్తీ మజా అనుకుంటూ లేనిపోని షోకులతో రేవ్ పార్టీ కల్చర్ కు అలవాటు పడుతున్నారు. రాత్రంతా మందేస్తూ, డ్రగ్స్ తీసుకుంటూ తమను తాము మరచిపోయి లేజర్ లైట్ల వెలుతురులో చిందేయడమే రేవ్ పార్టీ. ఒక్క మాటలో సూటిగా చెప్పాలంటే.. మందు, విందు, పొందు ఒకే దగ్గర లభించే వేదిక. డీజే సౌండ్స్, అర్ధ రాత్రి వరకు అర్ధనగ్నంగా కనిపించే అమ్మాయిలు ఆ తర్వాత సోయి లేకుండా బట్టలు విప్పేయడం.. అలా అలా శృంగార కార్యకలాపాలకు సిద్ధమవుతారు. అయితే రేవ్ పార్టీలకు వచ్చే అమ్మాయిలు అన్నింటికీ సిద్ధపడే వస్తారు. హుక్కా, గంజాయి, డ్రగ్స్ తీసుకున్నాక.. వాళ్లు ఏం చేస్తున్నారో వారికే తెలియదు.

సిటీ కల్చర్ లో భాగంగా మొదలైన పార్టీ కల్చర్ కాస్తా.. డ్రగ్స్ పార్టీలు, రేవ్ పార్టీల స్థాయికి చేరి.. విచ్చలవిడితనానికి బాటలు పరుస్తోంది. సమాజంలో అన్ని వర్గాలవారికీ ఈ బ్యాడ్ పార్టీ కల్చర్ పాకడం.. ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం ఇలాంటి పార్టీలపై సీరియస్ గా దృష్టి పెట్టకపోతే.. భవిష్యత్తులో హైదరాబాద్ చుట్టూ ఈ పోకడలు కామన్ గా మారే ప్రమాదం లేకపోలేదు.

# అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానం

- కుప్పకూలిన అహ్మదాబాద్-లండన్ ఎయిర్ ఇండియా విమానం..
- టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల్లోనే కుప్పకూలిన ఫ్లైట్..
- టేకాఫ్ తర్వాత సెకన్లలోనే సిగ్నల్ కట్..
- విమాన ప్రమాదంలో 242 మంది మృతి
- విమానంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాని!
- పక్షి ఢీ కొనడం వల్లే ఇంజన్లు ఫెయిల్యూర్..?
- డాక్టర్స్ హాస్టల్ మీద కూలిన విమానం
- 20 మంది వైద్యులు మృతి

**అహ్మదాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

ఒక్కరూ మిగల్లేదు. విమానంలో ఉన్న 242 మంది మృతి చెందారు. డెడ్‌బాడీస్ సైతం గుర్తు పట్టలేకుండా కాలి పోయాయి. పీస్ పీస్ అయ్యాయి. ఫ్లైట్ పడిన మెడికల్ కాలేజ్ బిల్డింగ్‌లో మరో 20 మందికి పైగా చనిపోయారు. మొత్తం మృతుల సంఖ్య 300 వరకు ఉండొచ్చని అంటున్నారు. విమానంలో ఇంధనం ఫుల్‌గా ఉండటంతో భారీ పేలుడు జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా మంటలు వ్యాపించి మరింత డ్యామేజ్ చేశాయి.

**సాంకేతిక సమస్యలే కారణమా?**

ప్రమాదం ఎందుకు, ఎలా జరిగిందన్న దానిపై వివరాలను పరిశీలిస్తున్నామని అన్నారు ఎయిరిండియా ఉన్నతాధికారులు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత విమాన ప్రమాదంపై స్పందిస్తామని ప్రకటించారు. అయితే, ఏవియేషన్ ఎక్స్‌పర్ట్స్ తమదైన శైలిలో విశ్లేషణలు మొదలుపెట్టారు. ఇంటర్నేషనల్ ఫ్లైట్స్ టేకాఫ్ జరిగేముందే పూర్తి స్థాయిలో సాంకేతిక పరీక్షలు, అన్ని రకాల చెకింగ్స్ చేస్తారని చెబుతున్నారు. అంతా ఓకే అనుకున్నాకే టేకాఫ్ కు అనుమతిస్తారని అంటున్నారు. సో, ఇంజిన్ ఫెయిల్యూర్, నావిగేషన్ లోపం, వాతావరణం లాంటి సమస్యలు కాకపోవచ్చని అంచనా వేస్తున్నారు. మరేంటి?

**ఏడాదిలో రెండు సార్లు..**

ఎయిర్ ఇండియా నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమైందా? విమానం కుప్పకూలడానికి మెయింటనెన్స్ ఇష్యూనే కారణమా? ఇప్పుడీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలోనూ ఇదే విమానంలో రెండు సార్లు ప్రమాదం చోటుచేసుకుందని తెలుస్తోంది. గత డిసెంబర్‌లో ప్యారిస్ వెళుతుండగా.. సాంకేతిక లోపంలో షార్జాలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. డీజీసీఏ హెచ్చరించినా ఎయిరిండియా పట్టించుకోలేదని తెలుస్తోంది.

అహ్మదాబాద్ విమానం కుప్పకూలడానికి కారణం ఏమై ఉండొచ్చు?

**పక్షి ఢీ కొట్టిందా?**

విమాన ప్రమాదానికి పక్షులు కారణం కావొచ్చనేది ఎక్కువగా వినిపిస్తున్న విశ్లేషణ. AI171 ఫ్లైట్ రన్ వే నుంచి సరిగ్గానే టేకాఫ్ అయింది. కానీ, కాసేపటికే కిందకు వేగంగా పడిపోవడం మొదలైంది. అంటే, టేకాఫ్ అయిన తర్వాత పక్షులు విమానాన్ని ఢీకొని ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. పైగా పైలట్లు మేడే కాల్ సైతం ఇచ్చారు. ఆపద పరిస్థితుల్లో తాము ఉన్నామని.. సాయం చేయమని పైలట్లు కోరారు. ఇది కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో నివాస గృహాలు, చెట్లు ఎక్కువగానే ఉన్నాయి. పక్షులు ఢీకొనే అవకాశం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. అసలు కారణం పూర్తి స్థాయి దర్యాప్తు తర్వాతనే తెలుస్తుంది.

**డొక్కు విమానం వల్లేనా..?**

మరోవైపు, సోషల్ మీడియాలో ప్రస్తుతం ఓ వీడియో వైరల్‌గా మారింది. ప్రమాదం జరగడానికి ముందు ఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు వచ్చింది AI 171 విమానం. అయితే ఈ విమానంలో ఎలాంటి సదుపాయాలు లేవని ఓ ప్రయాణీకుడు ఫిర్యాదు చేశాడు. దానికి సంబంధించిన వీడియోలను పోస్ట్ చేశాడు.



# ఒక్కొక్కరికి రూ.1 కోటి

- ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా గ్రూప్ 1 కోటి ఎక్స్‌గ్రేషియా
- టాటా గ్రూప్ ఒక్కొక్కరికి రూ.1 కోటి సహాయం

**అహ్మదాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే క్రాష్ అయ్యింది. ఈ ప్రమాదంలో దాదాపు విమానంలో ప్రయాణించిన వారంతా చనిపోయారని సమాచారం వినిపిస్తోంది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం మృతుల్లో 230 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది ఉన్నారు. 230 మంది మృతుల్లో 53 మంది బ్రిటన్ పౌరులు, ఏడుగురు పోర్చుగల్ పౌరులు, ఒకరు కెనడా దేశస్థుడు ఉన్నారు. మృతుల్లో 217 మంది పెద్దవారు, 11 మంది పిల్లలు, ఇద్దరు పసివాళ్లు ఉన్నట్లు సమాచారం.

విమాన ప్రమాదంలో 169 మంది భారతీయులు మృతి చెందారని సమాచారం. కాగా ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల కుటుంబాలకు టాటా గ్రూప్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.కోటి సహాయం అందించనున్నట్లు వెల్లడించింది. ప్రమాదంలో గాయపడిన వారి వైద్య ఖర్చులను కంపెనీ పూర్తిగా భరిస్తుందని, వారికి అవసరమైన అన్ని సంరక్షణ దీర్ఘకాలిక మద్దతు లభిస్తుందని కూడా టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు స్పీడప్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు స్పీడప్
- నాలుగోసారి ప్రణీత్‌రావును విచారించనున్న సిట్
- రేపు ప్రణీత్‌రావును ప్రశ్నించనున్న సిట్ అధికారులు
- ఎల్లుండి ప్రభాకర్‌రావుతో కలిపి మరోసారి ప్రణీత్‌రావును ప్రశ్నించనున్న సిట్

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) దర్యాప్తు మరింత వేగంగా సాగుతోంది. ఇప్పటికే అనేకమంది అధికారులను విచారించిన సిట్, ఈ కేసులో కీలకంగా భావిస్తున్న మాజీ ఎస్ఆర్ఎస్ అధికారి ప్రణీతరావు, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావులను విచారణకు పిలిచింది. రేపు ప్రణీతరావు, ఎల్లుండి ప్రభాకర్ రావు హాజరుకావాలని సిట్ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో అత్యంత సంచలనంగా మారిన అంశం.. రెండు టెరాబైట్ల హార్డ్ డిస్క్‌ల ధ్వంసం వ్యవహారం. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలకమైన డేటా ఉన్న ఈ హార్డ్ డిస్క్లను ప్రణీతరావే ధ్వంసం చేశారని సిట్ అనుమానిస్తోంది. ఆమె ఈ హార్డ్ డిస్క్లను నాశనం చేసి, వాటిని మూసీ నదిలో పడేసినట్లు ఆధారాలు లభించాయి. విచారణలో ఆమెకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

అలాగే, ఈ చర్య వెనుక ప్రభాకర్ రావు ప్రమేయం ఉందని సిట్ అనుమానిస్తోంది. అయితే, ప్రభాకర్ రావు మాత్రం తాను పదవి నుంచి రాజీనామా చేసి వెళ్లిపోయిన తరువాతే హార్డ్ డిస్కల ధ్వంసం జరిగిందని చెబుతున్నారు. వీరి మధ్య ఎదురు ఆరోపణలు, వివరణలతో కేసు మరింత మలుపు తిరిగింది. ఇప్పుడు దర్యాప్తు అధికారుల దృష్టి మూడు కీలక అంశాలపై ఉంది.. హార్డ్ డిస్క్లను ధ్వంసం చేయాలని ఆదేశించినది ఎవరు? ఈ నిర్ణయం వెనుక ఉద్దేశ్యం ఏమిటి? ధ్వంసమైన డేటాలో ఏమి ఉండేది? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికితే, ఈ కేసు వెలుగు చూసే విధానం పూర్తిగా మారే అవకాశం ఉంది.



# ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి త్వరగా కోలుకోవాలి.

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం నాడు గాయపడి సోమాజిగూడ యశోధ హాస్పిటల్ లో జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆసుపత్రిని సందర్శించారు. ఎమ్మెల్యే పల్లా గారి సతీమణి నీలిమ గారిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం త్వరగా కోలుకుని జనజీవనంలోకి రావాలని గారు ఆకాంక్షించారు.



# సామాజిక న్యాయంతో కేబినెట్ కూర్పు

- ఢిల్లీలో కేవలం కర్ణాటకలో కులగణనపై మాత్రమే చర్చించాం
- డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ లేకుండా శాఖలపై చర్చ ఎలా ఉంటుంది?
- మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే ప్రధాన అడ్డంకి అన్న సీఎం



**న్యూఢిల్లీ జూన్ 01(ప్రజాక్షేత్రం):** 'కర్ణాటకలో చేపట్టే కులగణన అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో చర్చించేందుకే ఢిల్లీకి వచ్చా. రాష్ట్రంలో మంత్రులకు శాఖల కేటాయింపుపై పెద్దగా చర్చ జరగలేదు. డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు లేకుండా శాఖల కేటాయింపుపై ఎలా చర్చిస్తాం? తెలంగాణ చేసింది కేవలం కులగణన సర్వే మాత్రమే కాదు. సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి, విద్య అంశాల సర్వే.

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి వ్యక్తిగత డేటా పూర్తిగా మా వద్ద ఉంది. 97 శాతం మంది సర్వేలో పాల్గొన్నారు. సర్వే చేయడంతో ఆగిపోకుండా ఆ మేరకు సామాజిక న్యాయంతో రాష్ట్ర కేబినెట్ కూర్పు చేశాం. చరిత్రలోనే తొలిసారి సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ జనాభాలో 15 శాతం ఉన్న ఎస్సీలకు 27 శాతం పదవులిచ్చాం. 4 మంత్రి పదవులతో పాటు స్పీకర్ పదవి ఎస్సీలకిచ్చాం. ఎస్టీలకు ఒక మంత్రి పదవి, డిప్యూటీ స్పీకర్ అవకాశం ఇచ్చాం.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 8 మంది రెడ్లు, 4 వెలమలకు మంత్రులుగా అవకాశమిచ్చి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేవలం మూడు మంత్రి పదవులే ఇచ్చారు..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. పార్టీ అధిష్ఠానంతో భేటీ నిమిత్తం మూడ్రోజుల కిందట ఢిల్లీ వచ్చిన సీఎం.. బుధవారం తన అధికారిక నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

**స్థానిక సంస్థల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు**

సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే పార్టీగా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 42 శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా అమలు చేస్తాం. ఈ మేరకు ఇతర పార్టీలను కూడా కోరతాం. కేంద్రం ఆమోదిస్తే అధికారికంగానూ అమలు చేస్తాం. కులగణన ఆధారంగా నిమ్న వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించే విషయమై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీని నియమించాం. ఆ కమిటీ సిఫారసుల మేరకు ముందుకు వెళతాం. స్థానిక సంస్థల ఎన్నికలు కోర్టులో కేసులు తేలిన వెంటనే నిర్వహిస్తాం.

**ప్రక్షాళన ప్రచారంలో నిజం లేదు**

పాత మంత్రుల్లో ఎవరైనా తమకు పనిభారం ఎక్కువగా ఉందని చెబితే, వారి శాఖల మార్పుపై నిర్ణయం తీసుకుంటాం. రాష్ట్ర మంత్రివర్గంలోకి కొత్తగా చేరిన వారికి తన వద్ద ఉన్న శాఖలను పంచుతా. శాఖల ప్రక్షాళనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. నా వద్ద 12 శాఖలు ఉన్నాయి. వీటినే కొత్త మంత్రులకు పంచాలని భావిస్తున్నా. మిగతా వారివద్ద ఏయే శాఖలున్నాయి, ఎక్కువ శాఖలున్న మంత్రులు ఎవరిపైనైనా పని భారం ఉందా? అన్న దానిపై చర్చిస్తాం. ఎవరైనా పనిభారం ఉందంటే శాఖలను మారుస్తాం. హైదరాబాద్‌లో అందరితో మాట్లాడి నిర్ణయం చేస్తాం.

**'కాళేశ్వరం'పై రెండ్రోజుల్లో ప్రజల ముందుకు..**

కాళేశ్వరం అక్రమార్కులపై కచ్చితంగా చర్యలుంటాయి. రెండ్రోజుల్లో హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి కాళేశ్వరంపై నా అభిప్రాయాన్ని, గతంలో జరిగిన తప్పిదాలను ప్రజల ముందు ఉంచుతా. కాళేశ్వరం ప్రాజెక్టును అప్పటి ప్రభుత్వం ఏటీఎంలా మార్చుకుందని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ఆరోపణలు చేస్తే, ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ మాత్రం కాళేశ్వరంలో అంతా బాగానే ఉందని చెప్పడం ఏంటి? రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే వంద శాతం అడ్డంకి.

తెలంగాణ సమస్యలపై ఆయన కేంద్ర కేబినెట్‌లో ఒక్కసారైనా మాట్లాడారా? రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదు. నిర్మలా సీతారామన్ చెన్నైకి, ప్రల్హాద్ జోషి కర్ణాటకకు మెట్రో తీసుకెళ్లారు. అలాంటిది తెలంగాణ మెట్రోకు కిషన్‌రెడ్డి ఎందుకు అడ్డుపడుతున్నారు? కేటీఆర్ వ్యతిరేకిస్తున్నారు కాబట్టే కిషన్‌రెడ్డి కూడా వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై రివ్యూ జరుపుతానంటే హైదరాబాద్ సచివాలయంలో లేదంటే.. ఢిల్లీలో.. ఎక్కడైనా అధికారులతో కలిసి సమీక్షకు నేను రెడీ.

**కేసీఆర్ ఫ్యామిలీ రాష్ట్రానికి శత్రువులు**

కేసీఆర్ కుటుంబం రాష్ట్రానికి దుష్మన్లు (శతువులు). వారిని, బీఆర్‌ఎస్ నేతలను నేను ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేది లేదు. కేసీఆర్ ఫ్యామిలీ కొరివి దెయ్యాల ఫ్యామిలీ అని గతంలోనే చెప్పా. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత అసెంబ్లీ రౌడీ సినిమాలో 'బాషా'బ్యాచ్ లాంటివాళ్ళు. వాళ్ల కుటుంబ పంచాయితీ ఆ సినిమా మాదిరిగానే ఉంది. మీడియా దృష్టి తమ వైపు తిప్పుకునేందుకు డ్రామాలు ఆడుతున్నారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని కవిత చెప్పింది. ఇప్పటివరకూ దానిపై కేసీఆర్ మాట్లాడలేదు.

**అసమానతలున్నంత కాలం నక్సలిజం అంతం కాదు**

నక్సలిజం సామాజిక సమస్య. దేశంలో సామాజిక అసమానతలున్నంత కాలం నక్సలిజం అంతం కాదు. ఎవరూ అంతం చేయలేరు. సామాజిక అసమానతలను తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో చర్యలను చేపట్టింది. ప్రధానిగా ఇందిరాగాంధీ భూ సంస్కరణలు తీసుకువచ్చారు. 'దున్నేవాడిదే భూమి'అనే నినాదం ఆదర్శంగా తెలంగాణలో నిరుపేదలకు లక్షల ఎకరాలు పంచారు. ఇళ్లు కట్టించారు. వీటివల్ల నక్సలిజం తగ్గింది. కులగణన సర్వే అమలుతోనూ నక్సలిజం తగ్గుతుంది.

# 200 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

- ముగిసిన నీటిపారుదల శాఖ ఏఈ శ్రీధర్ ఇంట్లో ఏసీబీ సోదాలు..
- కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ అరెస్ట్
- రూ.200 కోట్ల పైచిలుకు అక్రమ ఆస్తులను కలిగి ఉన్నట్టు ఆరోపణ
- నిన్న శ్రీధర్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు
- శ్రీధర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించిన ఏసీబీ అధికారులు

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

కరీంనగర్‌కు చెందిన నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) శ్రీధర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) బుధవారం తెల్లవారుజామున భారీగా దాడులు నిర్వహించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శ్రీధర్‌పై నమోదైన ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 13 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టిన ఏసీబీ అధికారులు, పెద్దఎత్తున అక్రమ ఆస్తులు వెలుగులోకి తీసుకొచ్చారు. కరీంనగర్, సిద్ధిపేట్, వరంగల్, హైదరాబాద్ సహా మొత్తం 13 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఉన్న శ్రీధర్ నివాసంలో సోదాలు ప్రారంభమై తెల్లవారుజామున 3 గంటల వరకు కొనసాగాయి.

శ్రీధర్ దంపతుల పేరుపై నమోదు అయిన ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయన హైదరాబాద్ శేక్‌పేట్‌లో ఉన్న స్కై హైటెడ్ అపార్ట్మెంట్‌లో రూ.4500 చదరపు అడుగుల విల్లా, అమీర్‌పేటలో కమర్షియల్ కాంప్లెక్స్, మూడు ఫ్లాట్లు, మూడు ఇండివిడ్వల్ హౌస్‌లు, 19 ఫ్లాట్లు, 16 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు రెండు కార్లు, భారీగా బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. తన కుమారుడి పెళ్లిని థాయిలాండ్‌లో జరిపించిన శ్రీధర్, నగరంలోని పేరుగాంచిన హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లలో భారీగా పెట్టుబడులు పెట్టినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. ఇంకా ఆయనకు సంబంధించి బ్యాంకు లాకర్లను పరిశీలించాల్సి ఉంది.

బుధవారం అర్ధరాత్రి శ్రీధర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించిన ఏసీబీ అధికారులు, ఇవాళ ఉదయం 6 గంటలకు ఆయనను చంచల్‌గూడ జైలుకు రిమాండ్ చేశారు. ఈ కేసు రాష్ట్రంలో మరో సంచలన అవినీతి దర్యాప్తుగా నిలుస్తుందని భావిస్తున్నారు. శ్రీధర్‌పై కేసు నమోదు చేసి పూర్తి ఆస్తుల లెక్కలు తేల్చేందుకు ఏసీబీ బృందాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి.



# గోదావరి-బనకచర్ల ఫస్ట్.. తర్వాత సోమశిల-కావేరి లింక్


- కేంద్రానికి ఏపీ సర్కారు కొత్త ప్రతిపాదనలు
- సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కేంద్ర ప్రభుత్వం..!
- కుట్రపూరితంగా నేడు ఢిల్లీలో టాస్క్‌ఫోర్స్ భేటీ
- దీనికంటే ముందే జరగాల్సిన కన్సల్టెన్సీ మీటింగ్ వాయిదా
- రివర్‌బోర్డులకు పీపీఏకు చేరిన ప్రీ ఫీజబులిటీ రిపోర్టు
- వేగంగా పావులు కదుపుతున్న బాబు సర్కారు

**హైదరాబాద్ జూన్ 01(ప్రజాక్షేత్రం):**

తొలుత గోదావరిబనకచర్ల ప్రాజెక్టును చేపట్టాలని, ఆ తరువాత కావేరికి జలాలను తరలించే అవకాశం ఉంటుందని కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదనలు చేసినట్టు తెలిసింది. అందుకు కేంద్రం సైతం సూత్రప్రాయంగా అంగీకరించినట్టు స్పష్టమవుతున్నది. ఈ నేపథ్యంలోనే నదుల అనుసంధాన ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని హడావుడిగా నిర్వహించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. ఈ సమావేశం గురువారం ఢిల్లీలో జరగనున్నది. నదుల అనుసంధాన ప్రాజెక్టులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. తమిళనాడుకు తాగునీటిని తరలించేందుకు గోదావరికావేరి ఇంటర్‌స్టేట్ రివర్ లింకింగ్ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ఆ ప్రాజెక్టుకు ఆమోదం పొందేందుకు సంబంధిత రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుతో ఇప్పటికే ఆరుసార్లు సమావేశాలు నిర్వహించింది. సాంకేతిక అంశాలపై చర్చించింది.

తమిళనాడు, కర్ణాటక మినహా బేసిన్‌లోని ఇతర రాష్ట్రాలేవీ అందుకు అంగీకరించలేదు. గోదావరికావేరి (జీసీ) లింక్‌పై తెలంగాణ సైతం ఆదినుంచీ అనేక అభ్యంతరాలను వ్యక్తంచేస్తున్నది. సమ్మక్కసాగర్ నుంచే లింక్ ప్రాజెక్టును చేపట్టాలని, అదీ 83 ఎఫ్‌ఆర్‌ఎల్ పైన, వరద సమయంలోనే జలాలను మళ్లించాలని, ఆ విధంగా గోదావరి నుంచి మళ్లించే జలాల్లో 50% వాటా అంటే 74 టీఎంసీలను తెలంగాణకే కేటాయించడంతోపాటు ఆ మేరకు నిల్వ సామర్థ్యంతో రెండు రిజర్వాయర్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేసింది. వాస్తవంగా ప్రస్తుతం జీసీ లింక్ ద్వారా మళ్లించాలని భావిస్తున్న 148 టీఎంసీలు కూడా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వినియోగించుకోని వాటా జలాలే. ప్రస్తుతం ఆ రాష్ట్రం కూడా తమ వాటా జలాలను వినియోగించుకుంటామని, ఆ మేరకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నామని, కాబట్టి జీసీ లింక్‌కు అంగీకరించబోమని తేల్చిచెప్పింది.

దీంతో జీసీ లింక్ ప్రాజెక్టు ముందుకుపోవడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం, ఏపీ కొత్తగా పావులు కదుపుతున్నాయని తెలుస్తున్నది. కాగా, గోదావరికావేరి లింక్‌ను పోలవరం నుంచే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ మొదటినుంచీ ప్రతిపాదిస్తూ వస్తున్నది. కేంద్రం తొలుత వ్యతిరేకించినా ప్రస్తుతం అందుకు అంగీకరించినట్టు తెలుస్తున్నది. అందులో భాగంగానే ఏపీ తాజాగా ఇంట్రాస్టేట్ రివర్ లింకింగ్ ప్రాజెక్టు పేరిట గోదావరిబనకచర్ల (జీబీ) లింక్‌ను తెరమీదకు తీసుకొచ్చింది. తద్వారా గోదావరి జలాలను తొలుత కృష్ణా మీదుగా బనకచర్లకు తరలించి, అక్కడినుంచి సోమశిలకు, ఆపై కావేరికి తరలించే అవకాశం ఉన్నది. దీంతో ఇటు ఏపీతోపాటు అటు కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరనున్నది. ఈ నేపథ్యంలోనే కేంద్రం గోదావరికావేరి లింక్ ప్రాజెక్టును పక్కనపెట్టి, జీబీ లింక్ ప్రాజెక్టుకు మద్దతు తెలిపినట్టు సమాచారం. దీంతో తెరమీదకు 'గోదావరిసోమశిలకావేరి' లింక్ ప్రాజెక్టు వచ్చింది. కేంద్రం సైతం ఏపీ ప్రతిపాదించిన ఇంట్రా స్టేట్ రివర్ లింకింగ్ ప్రాజెక్టు ఆర్థిక సాయం అందిస్తామని బాహాటంగానే ప్రకటించింది. కేంద్రం నుంచి స్పష్టమైన హామీ లభించిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం జీబీ లింక్‌పై దూకుడుగా ముందుకుపోతున్నది.



**కన్సల్టెన్సీ మీటింగ్ లేకుండానే నేడు టాస్క్‌ఫోర్స్ భేటీ**

నదుల అనుసంధాన ప్రాజెక్టులను చేపట్టేందుకు తొలుత బేసిన్ రాష్ట్రాలతో కేంద్రం సాంకేతిక సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. ఆ కన్సల్టెన్సీ మీటింగ్‌లో రాష్ట్రాలు లేవనెత్తిన అంశాలపై రివర్‌లింక్ ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ కమిటీ భేటీ అవుతుంది. లేదంటే ఏకకాలంలో కన్సల్టెన్సీ, టాస్క్‌ఫోర్స్ కమిటీల సమావేశాన్ని నిర్వహిస్తుంది. ఆయా అంశాలపై రాష్ట్రాల వారీగా చర్చించడం పరిపాటి. అందులో భాగంగా ఈ 12న జీసీ (గోదావరికావేరి) లింక్‌పై కన్సల్టెన్సీ మీటింగ్‌ను హైదరాబాద్ జలసౌధలో నిర్వహించాలని ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయించింది. కానీ, అకస్మాత్తుగా ఆ సమావేశం 24కు వాయిదాపడింది. కానీ, ఇప్పుడు కన్సల్టెన్సీ మీటింగ్ లేకుండానే ఉన్నట్టుండి 12వ తేదీన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. దీని వెనుక అసలు మతలబు గోదావరిబనకచర్లసోమశిలకావేరి లింక్ ప్రాజెక్టునేనని విశ్వసనీయ సమాచారం.

**రివర్ బోర్డులకు, పీపీఏకు జీబీ లింక్ రిపోర్టు**

గోదావరిబనకచర్ల (జీబీ) లింక్ ప్రాజెక్టుకు సంబంధించి రూపొందించిన ప్రీ ఫీజబులిటీ రిపోర్టును (పీఎఫ్‌ఆర్) ఏపీ ప్రభుత్వం ఇటీవల కేంద్ర జల్‌శక్తి, ఆర్థిక శాఖలకు పంపింది. తాజాగా ఆ రిపోర్టును గోదావరి, కృష్ణా రివర్ బోర్డులతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సైతం కేంద్రం పంపింది. పీఎఫ్‌ఆర్‌ను పూర్తిగా అధ్యయనం చేసి అభిప్రాయాలు తెలపాలని కేంద్రం సూచించింది. దాదాపు రూ.80 వేల కోట్లతో చేపట్టనున్న జీబీ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్థిక సాయం చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును గత నెల 23న కేంద్రానికి ఏపీ సమర్పించింది. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖకు సైతం ప్రాజెక్టుపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చింది. తాజాగా పీఎఫ్‌ఆర్‌ను రివర్ బోర్డులకు, పీపీఏకు కేంద్రం పంపింది. అభిప్రాయాలను తెలపాలని సూచించింది.



# సమస్యలతో చదువులకు స్వాగతం!

- సమస్యల సుడిగుండంలో బడులు
- ప్రారంభమైన కొత్త విద్యాసంవత్సరం
- విద్యార్థులకిచ్చేది జత యూనిఫారమే
- ఆందోళన కలిగిస్తున్న ఎన్‌రోల్‌మెంట్
- సమీక్షించేందుకు తీరికలేని సీఎం

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలోని పలు సర్కారు బడులు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. వసతులలేమీతో కొట్టుమిట్టాడుతున్నాయి. గురువారం నుంచి రాష్ట్రంలో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాయి. కొన్ని స్కూళ్లు సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. ఉచిత పుస్తకాలిచ్చేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం విద్యార్థులకు ఒక జత యూనిఫారమే అందనున్నది. సర్కారు బడుల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఆందోళన కలిగిస్తున్నది. 34 లక్షల మంది తగ్గిపోయారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేరు. సీఎం రేవంత్‌రెడ్డి వద్దే విద్యాశాఖ ఉంది. గతంలో ప్రతి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే సమయంలో విద్యాశాఖ మంత్రి మే, జూన్ మాసాల్లో అధికారులతో సమీక్షించడం ఆనవాయితీ. కానీ ఈ సారి సీఎం రేవంత్ ఒక్కటంటే ఒక్క సమీక్ష నిర్వహించలేదు. పాఠశాల విద్యాశాఖకు పూర్తిస్థాయి రెగ్యులర్ డైరెక్టర్ లేరు. దీంతో అటువైపు దృష్టి పెట్టిన వారులేరు.

**17వేల టీచర్ పోస్టులు ఖాళీ**

సర్కారు బడుల్లో 17వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 26,861 స్కూళ్లు ఉండగా 1,27,543 టీచర్ పోస్టులున్నాయి. వీటిలో 1,11,091 టీచర్లు మాత్రమే ఉన్నారు. 16,969 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిరుడు 10 వేల టీచర్ పోస్టులు భర్తీచేశారు. అయినా 17వేల టీచర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ప్రాథమిక బడుల్లోనే 9వేలకుపైగా ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మాడల్ స్కూల్‌లో 201314లో రిక్రూట్‌మెంట్ చేశారు. మళ్లీ టీచర్లను నియమించిన దాఖలాల్లేవు. అవర్లీ బేస్డ్ టీచర్లతో నెట్టుకొస్తున్నారు. టీచర్లున్న చోట విద్యార్థుల్లేరు.. విద్యార్థులున్న చోట టీచర్లు లేరన్న కారణంతో టీచర్ల సర్దుబాటును చేపట్టారు. ఈ సర్దుబాటు జూలై 15తో ముగియనున్నది.

**పట్టిపీడిస్తున్న వసతులలేమి..**

సర్కారు బడులను వసతులలేమీ పట్టిపీడిస్తున్నది. 21వ శతాబ్దంలోనూ ఇంకా తాగేందుకు నీళ్లు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు టాయిలెట్లు లేని స్కూళ్లున్నాయి. 696 స్కూళ్లకు ఇంకా పక్కాభవనాలే లేవు. అద్దె భవనాల్లో 239 స్కూళ్లు నడుస్తున్నాయి. అద్దె లేకుండా ఇతర భవనాల్లో మరో 264 స్కూళ్లను నిర్వహిస్తున్నారు. ఇతర శాఖలకు చెందిన భవనాల్లో 34స్కూళ్లు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఓపెన్ ప్లేస్‌లో 159 స్కూళ్లు నడుస్తున్నాయి. 28% స్కూళ్లకు ప్రహరీలు లేవు. 35.92% స్కూళ్లకు ఆటస్థలాల్లేవు. కిచెన్‌షెడ్లు లేని స్కూళ్లు 42శాతానికి పైగా ఉన్నాయి.

**సమస్యలు మచ్చుకు కొన్ని..**

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం రామచంద్రాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చెట్టు కూలిపోయి భవనంపై పడింది. దీంతో గోడలు పగుళ్లు చూపాయి. పిల్లలు బిక్కుబిక్కుమంటూ తరగతి గదులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ పాఠశాల మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గ పరిధిలో ఉండటం గమనార్హం.



# ఇది మార్పా రేవంత్ గారు..? హరీష్ రావు సెటైర్లు

- గ్రామ పంచాయతీలకు నిధులు లేక ఇబ్బంది
- ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చు లేక తాళాలు అప్పగింపు
- ఇది మార్పా? అంటూ రేవంత్‌పై హరీష్ ఎద్దేవా

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. గ్రామ పంచాయతీలకు నిధుల పంపిణీ అంశాన్ని మరోసారి ప్రస్తావిస్తూ ఆయన ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. గత 16 నెలలుగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు నిధులు అందకుండా ఉండటాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుపట్టారు.

ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యాలయాలకు చెందిన ట్రాక్టర్లను నడిపేందుకు డీజిల్ ఖర్చులూ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు వాటి తాళాలను ఉన్నతాధికారులకు అప్పగిస్తున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఈ విషయాన్ని ఎక్స్ (ఇటీవల ట్విటర్ గా పేరొందిన ప్లాట్‌ఫార్మ్) వేదికగా ప్రస్తావించిన హరీశ్ రావు, "కాంగ్రెస్ పార్టీ చెప్పిన మార్పు ఇదేనా రేవంత్ రెడ్డి గారు? ఇది మార్పు కాదు, ఏ మార్పూ కాదు" అంటూ ఎద్దేవా చేశారు.





# ఉల్లంపల్లి పాలకేంద్రంలో ముగ్గురు డైరెక్టర్లు ఎన్నిక

**కొత్త తిరుపతి,జెరిపోతుల సింగరయ్య,కానవేని తిరుపతి ఎన్నిక..**

**చిగురుమామిడి జూన్ 12(ప్రజాక్షేత్రం):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలోని కరీంనగర్ డెయిరీలో గురువారం ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకున్నట్లు రూట్ సూపర్ వైజర్ సీతా రవి,పాలకేంద్రం అధ్యక్షులు పత్తెం రవీందర్ తెలిపారు. డైరెక్టర్ లుగా కొత్త తిరుపతి,జెరిపోతుల సింగరయ్య, కానవేణి తిరుపతిలను ఎన్నుకున్నట్లు చెప్పారు.పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా కరీంనగర్ డెయిరీ నిరంతరం పనిచేస్తుందని,రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను పెంపొందించుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని రూట్ సూపర్వైజర్ రవి పిలుపునిచ్చారు.ఐక్యమత్యంతో పాల కేంద్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షులు రవీందర్, డైరెక్టర్లు సుదగొని రాజు, పత్తెం సమ్మయ్య, పత్తెం సమ్మయ్య, కానవేని హమ్మయ్య,మొగిలి,కానవేణి మల్లయ్య,పాలకేంద్రం కార్యదర్శి కోల ప్రభాకర్,టెస్టర్ పత్తెం అనిల్,పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.



# రామంచలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

- తమ పట్టా భూముల పక్కన ఇసుక తీస్తున్నారని అడ్డగింపు..
- తమ భూమి వాగులో కోతకు గురవుతుందని ఆవేదన

**చిగురుమామిడి జూన్ 12(ప్రజాక్షేత్రం):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుండి ఇసుక తరలిస్తుండడంతో గ్రామానికి చెందిన పలువురు రైతులు వారిని అడ్డుకున్నారు. వాగులో ఇసుక తీస్తుండగా నీళ్లు రావడంతో తమ పట్టా భూముల పక్కన ఇసుక తోడేస్తున్నారని, దీంతో తమ భూములు కోతకు గురవుతున్నాయని మాస్టిన్ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తు ట్రాక్టర్లను అడ్డుకున్నారు.తమకు వాగుతో నష్టం జరుగుతుందని, తమ భూముల పక్కన ఇసుక తీయవద్దని ఎంత చెప్పినా ట్రాక్టర్ల యజమానులు వినకపోవడంతో తోవ్వాలో గుంతలు తీసి ఆపాల్సి వచ్చిందని రైతులు దర్శనం నల్గొండ,దర్శనం నరసింహులు పేర్కొన్నారు. తమ బతుకు దెరువు కోసం ప్రభుత్వం తమకు ఇచ్చిన దాదాపు ఆరు ఎకరాల భూమిలో మాస్టన్ కులస్తులం పంటలు పండించుకుని జీవిస్తున్నామని, ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాగులో తోడాల్సిన ఇసుకను నీళ్లు వస్తున్నాయని తమ పట్టా భూముల పక్కన తీస్తున్నారని చెప్పారు. అధికారులు, పోలీస్ లు స్పందించి తమకు న్యాయం చేయాలని, తమ భూములు వాగులో కోతకు గురికాకుండా ట్రాక్టర్ యజమానులకు చెప్పాలని వారు కోరారు. ట్రాక్టర్లను అడ్డుకున్న వారిలో దర్శనం సారయ్య, చిన్న సారయ్య,దర్శనం స్వామి,పవన్, సంపత్, కృష్ణ,తదితరులు ఉన్నారు.




## ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సన్మానించిన పరకాల ఆర్యవైశ్య సంఘం.

**పరకాల జూన్ 12(ప్రజాక్షేత్రం):** పరకాల ఎరువులు పురుగుమందులు మరియు విత్తనముల డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన అరుణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ ప్రొప్రైటర్ గందె వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా నవత బ్రదర్స్ శివాజీని, కోశాధికారి మల్లికార్జున ట్రేడర్స్ ఎర్ర లక్ష్మణ్ లను పరకాల మండల ఆర్యవైశ్య సంఘం తరపున పరకాల అరుణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాప్ ఆవరణలో ఆర్యవైశ్య సంఘ సోదరులు వ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్యవైశ్య సంఘ నాయకులు సూర్యదేవర సదానందం, తమ్మిశెట్టి వెంకన్న, శ్రీరాం రవీందర్, ఇరుకుల్ల లక్ష్మణ్, ఎర్రం విద్యాసాగర్, దేవ సతీష్, శ్రీమన్నారాయణ, పాత రవీందర్ కొండ్ల విజయ్ ఎల్లంకి సతీష్, పుల్లూరు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.




## నూతన మినిస్టర్ క్వార్టర్స్ లో గృహప్రవేశం చేసిన వాకిటి దంపతులు.

**మక్తల్ ప్రతినిధి, జూన్ 12(ప్రజాక్షేత్రం):** తెలంగాణ రాష్ట్ర పశువర్ధక మరియు క్రీడలు మరియు యువజన శాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హైదరాబాదులోని మినిస్టర్స్ క్వాటర్స్ లో ప్రభుత్వం కేటాయించిన ఇంటి నెంబర్ 1 లో తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి మరియు లలితమ్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5 గంటల 46 నిమిషాలకు నూతన గృహప్రవేశం చేయగా అనంతరం హోమం, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు ముఖ్యులు పాల్గొన్నారు.



## ఫిట్నెస్ లేని వాహనాలను సీజ్ చేసిన రవాణా శాఖ, మరియు విజిలెన్స్ అధికారులు



**కుత్బుల్లాపూర్ జూన్ 12(ప్రజాక్షేత్రం):** పేట్ బషీరాబాద్ లోని ఆర్టిఏ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించిన ఆర్టిఏ ఇన్స్పెక్టర్ శిల్ప మరియు విజిలెన్స్ అధికారులు. గురువారం నుండి పాఠశాల లు పున: ప్రారంభించిన సందర్భంగా ఉదయం నుండి తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ తనిఖీల్లో (4) ఫిట్నెస్ లేని మరియు (1) పర్మిట్ లేని బస్సులను సీజ్ చేసినట్టు తెలిపారు ఫిట్నెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాల వల్ల రోడ్డు ప్రమాదాలకి జరుగుతున్నాయని తెలిపారు. దీని యొక్క ముఖ్య ఉద్దేశం బస్సులలో స్కూలుకు ప్రయాణించే విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు ఏ ఒక్క వెహికల్ అయినా ఫిట్నెస్ లేకుండా రోడ్లపై తిరిగితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు రోడ్లపై తిరిగే అన్ని వాహనాలని క్షుణ్ణంగా ఫిట్నెస్ ఉందా లేదా పరిశీలిస్తున్నామని తెలిపారు.. ఈ సందర్భంగా ఫిట్నెస్ లేని వాహనాలను సీజ్ చేసి ఆర్టీవో ఆఫీస్ కి తరలిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్టిఏ ఇన్స్పెక్టర్ శిల్ప మరియు విజిలెన్స్ అధికారులు, ఆర్టిఏ సిబ్బంది పాల్గొన్నారు.

# నేను ఒక్కడినే ఎమ్మెల్యేగా ఉన్నా..

- తెలంగాణలో గొల్లలు, కుర్మలు ఒక్కటే
- గొల్ల, కుర్మల తరుపున నేను ఒక్కడినే ఎమ్మెల్యేగా ఉన్నా
- గొల్ల, కుర్మలకు పార్టీలో, మంత్రి వర్గంలో చాన్స్ ఇవ్వాలి
- మాకు అవకాశాలు ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశాం

**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో గొల్లలు, కుర్మలు వేరని దుష్ప్రచారం చేశారని.. కానీ గొల్లలు, కుర్మలు ఒక్కటే అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. గొల్ల, కుర్మల తరుపున తాను ఒక్కడినే ఎమ్మెల్యేగా ఉన్నానని గుర్తు చేశారు. గొల్ల, కుర్మలు లేకుండా ఇప్పటి వరకు కేబినెట్ లేదని.. ఈసారి కూడా మంత్రి వర్గంలో గొల్ల, కుర్మలకు చాన్స్ ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలుస్తాం అని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. ఈరోజు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ని కలిసి గొల్ల, కుర్మలకు పార్టీలో, మంత్రి వర్గంలో అవకాశం కల్పించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కోరారు.

'గొల్ల, కుర్మలకు మంత్రి వర్గంలో, పార్టీ పదవులలో అవకాశం ఇవ్వాలి. గొల్ల, కుర్మలకు ఒక మంత్రి పదవి, ఒక అడ్వైజర్, ఒక ఎమ్మెల్సీ, ఐదు నామినేటెడ్ కార్పొరేషన్లు, ఐదు కమిషన్ సభ్యులు, ఒక వర్కింగ్ప్రెసిడెంట్, మూడు వైస్ ప్రెసిడెంట్లు, ఎనమిది ప్రధాన కార్యదర్శులు, ఐదు డీసీసీలు ఇవ్వాలి. తెలంగాణలో గొల్ల, కుర్మలు 28 లక్షలు ఉన్నారు. ఇందులో గొల్లలు 6 లక్షలు, కుర్మలు 22 లక్షలు ఉన్నారు. గొల్లలు, కుర్మలు వేరని దుష్ప్రచారం చేశారు. కానీ గొల్లలు, కుర్మలు ఒక్కటే. గొల్ల, కుర్మల తరఫున నేను ఒక్కడినే ఎమ్మెల్యేగా ఉన్నా. గొల్ల, కుర్మలు లేకుండా ఇప్పటి వరకు కేబినెట్ లేదు. ఈసారి కూడా మంత్రి వర్గంలో గొల్ల, కుర్మలకు చాన్స్ ఇవ్వాలి' అని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కోరారు.

'మాకు జనాభా ప్రకారం అవకాశాలు ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశాం. సీఎం రేవంత్ రెడ్డిని కూడా కలుస్తాం. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు న్యాయం జరుగుతుంది కానీ.. గొల్ల, కుర్మలకు కూడా అవకాశాలు ఇవ్వాలి. మా గొల్ల, కుర్మలకు న్యాయం చేస్తామని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబుకు హామీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ దేశానికి రోల్ మోడల్ అయింది. విద్యా, రాజకీయ, ఉపాధి అవకాశాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే' అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.






## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అమలు పై సమీక్ష సమావేశం

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబ్ బాద్, జూన్ 12(ప్రజాక్షేత్రం):** గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ ) కె. వీరబ్రహ్మచారి, జడ్పీ సీఈవో పురుషోత్తం, లతో కలిసి కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఇందిరమ్మ ఇండ్లు మంజూరుపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, మండల పంచాయతీ విస్తరణ అధికారులతో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పథకం ద్వారా పేద ప్రజలకు స్వంత ఇంటి నిర్మాణాలు చెప్పడం జరిగిందనీ, జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా బయ్యారం మండలం నామాలపాడు గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక కార్యచరణ ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయని, జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేసి ఇందిరమ్మ కమిటీ ద్వారా గుర్తించి ఆమోదం తెలిపి పనుల ప్రతిపాదనల ప్రకారం నిధులు మంజూరు చేయాలని సూచించారు, గ్రామ పంచాయతీ,పట్టణ ప్రాంతాల్లో కమిటీ సభ్యులు, లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని, ఈ పథకం అమలు కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు, జిల్లాలో అర్హులైన గిరిజన, పేద బడుగు బలహీన వర్గాల నిజమైన లబ్ధిదారులు ఉన్నారని వారికి పథకం అమలులో వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు, పథకం అమలులో మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మవద్దన్నారు, పూర్తిగా పారదర్శకంగా ప్రభుత్వం సూచించిన ప్రకారం కమిటీల ద్వారా లబ్దిదారుల ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వ సూచనలు ప్రకారం క్షేత్రస్థాయిలో స్థానిక వనరుల సేకరణ కోసం మైనింగ్, భూగర్భజల శాఖలు సమన్వయంతో కలిసి సర్వే నిర్వహించడం జరిగిందని, తదనంతరం ప్రభుత్వ సూచనల ప్రకారం తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, ఈ సమావేశంలో డీఆర్డీఓ ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన రాజు, హౌజింగ్ పిడి రాజయ్య, సూపర్డెంట్ దామోదర్ రెడ్డి, జిల్లాలోనీ అందరూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, శాంతికుమార్, నరేష్ రెడ్డి, ఉదయ్, మండల పంచాయతీ విస్తరణ అధికారులు, ఏఈలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వైద్యరత్న డాక్టర్ సత్యనారాయణ జన్మదిన వేడుకలు

**కుత్బుల్లాపూర్ జూన్ 12 (ప్రజాక్షేత్రం):**

హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ తుటే విజయ్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ సత్యనారాయణ 80 వ జన్మదిన వేడుకలు అశోక చక్ర దివ్యాంగుల సంఘంలో ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బషీర్బాగ్ సీసీస్ ఏసిపి కిరణ్ కుమార్ సమక్షంలో కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ వృత్తిరీత్యా వైద్యులు అయినప్పటికీ వివిధ రకాల సంఘ సేవ కార్యక్రమాలలో విరివిగా పాల్గొంటారని తెలియజేశారు, ఇంత గొప్ప మహనీయుని జన్మదిన వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు, విశిష్ట అతిథిగా పాల్గొన్న ఓయూ జేఏసీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దరువు అంజన్న మాట్లాడుతూ సత్యనారాయణని ఆయన చేస్తున్నా వైద్య సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం వైద్యరత్న అవార్డు ఇచ్చి అభినందించిందని తెలియజేశారు. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక ప్రాంతంలో విశ్వకర్మ కుటుంబంలో జన్మించిన సత్యనారాయణ పేదల డాక్టర్ గా పిలువబడతాడని గుర్తు చేశారు, అనంతరం సత్యనారాయణ దంపత చేతుల మీదుగా వికలాంగులు 15 మందికి నిత్యవసర సరుకులు ఇవ్వడం జరిగింది, వికలాంగుల సంఘం అధ్యక్షుడు ఏసుబాబు ఇలాంటి కార్యక్రమం చేయడం సంతోషమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మజా హాస్పిటల్ డైరెక్టర్ మధురిమ, మదర్ థెరిస్సా పౌడర్ శ్రావణ్ కుమార్, హైకోర్టు లాయర్ సంజన, భాగ్యలక్ష్మి ఫౌండేషన్ అధ్యక్షుడు మాణిక్యాచారి, మాధవాచారి, కనుకచారి, రామాచారి, శివాజీ, కనుక చారి, మహేంద్ర ఆచార్యులు, భగవంతు చారి శ్రీనివాస చారి హనుమంత ఆచారి మనోహరాచారి, తదితరులు పాల్గొన్నారు.




## తుంగతుర్తి మండల స్థాయి ఉత్తమ ప్రాథమిక పాఠశాలగా మొదటి స్థానంలో ఎంపిక

**మండల పరిషత్ వెంపటి ప్రాథమిక పాఠశాల కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు**

**తుంగతుర్తి, జూన్ 12(ప్రజాక్షేత్రం):** తుంగతుర్తి మండల స్థాయిఉత్తమ ప్రాథమిక పాఠశాలగామండల పరిషత్ వెంపటి ప్రాథమిక పాఠశాల 202425 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచినందుకు, నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు, మంచి ఫలితాలు సాధిస్తు, విద్యార్థుల సర్వతోముఖాబివృద్ధికి..కృషి చేసి ప్రథమ స్థానంలో నిలిచినందున తుంగతుర్తి మండలంలో ఉత్తమ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలగా వెంపటి ప్రాథమిక పాఠశాల ఎంపికై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా విద్యాశాఖ అధికారి కే.అశోక్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామానర్సమ్మ అవార్డు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఈఅవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తమపై మరింత బాధ్యత పెంచిందని, పాఠశాల ఉపాధ్యాయ బృందం సమన్వయ, సమిష్టి కృషికి నిదర్శనమని, విద్యార్థుల తల్లిదండ్రులసహకారం,గ్రామ ప్రజల సహకారం, యువజన సంఘాల సహకారం, దాతల సహకారంతో.. ముందుకెళ్తున్నామని, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం అన్ని రకాల విద్యా కార్యక్రమాలను అమలు చేస్తున్నామని... పాఠశాలను మరింత అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తానన్నారు..ఇట్టి కార్యక్రమంలో వేదిక మీదమండల విద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య, పాఠశాల ఉపాధ్యాయబృందం పాలకుర్తి ఎల్లయ్య, మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, నిమ్మన బోయిన నవీన, బండారు భవాని, జీడిఅనిల్ కుమార్, మిట్ట గడుపుల విక్రమ్, గుండ్ల ఆంజనేయులు, మాలోతు కృష్ణ లుపాల్గొన్నారు




## తుపాకితో బెదిరించి ఐదు లక్షలతో ఉడయించిన దుండగులు

**మేడ్చల్ జూన్ 12(ప్రజాక్షేత్రం):**

కుత్బుల్లాపూర్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లిలో కిరాణా కొట్టు మూసివేసి ఇంటికి వెళ్లే క్రమంలో తుపాకీ తో బెదిరించి డబ్బు తీసుకుని పారిపోయిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడు సాయి బాబా(50) తెలిపిన వివరాల ప్రకారం గత రాత్రి 10 గంటల సమయంలో కిరాణా షాపు మూసి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇద్దరు బైక్ పై వచ్చి తుపాకీ తో బెదిరించి తన వద్ద ఉన్న 5లక్షల రూపాయల బ్యాగును లాక్కొని పారిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు బాధితుడు. కేసు నమోదు చేసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.




## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష బరిలో వంగాల అశోక్ గౌడ్

**వలిగొండ,జూన్ 12(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా,మండల అధ్యక్షుడు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ అశోక్ గౌడ్ బుధవారము సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో, జిల్లా అధ్యక్షుడు అండం సంజీవరెడ్డికి తన దరఖాస్తు ఫారాని అందజేశారు.ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని బలోపేతానికి కృషి చేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించాలనని అన్నారు. పార్టీ అధికారం ఉన్నలేకున్నా, కాంగ్రెస్ పార్టీ నమ్ముకొని కార్యకర్తలకు అండగా ఉంటూ సహకారాలు అందించినానని అన్నారు. పార్టీ అధిష్టానం గుర్తించి అధ్యక్ష పదవి ఇవ్వాలని అన్నారు.





## ఓపెనింగ్ చీఫ్ గెస్ట్ గా బిజెపి మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

**వలిగొండ,జూన్ 12(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,బిజెపి పార్టీ ఆఫీసులో 11 సంవత్సరాల నిండిన సందర్భంగా ఫోటో గ్యాలరీ ఓపెనింగ్ కు చీఫ్ గెస్ట్ గా వరంగల్ మన బిజెపి మాజీ ఎమ్మెల్యే ధర్మారావు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి ఎన్ రెడ్డి,దాసరి మల్లేశం,పోత్తం శెట్టి రవీందర్,కర్నాటి ధనుంజయ, పడాల శీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ విద్యా సంస్థల్లో పుస్తకాలు డ్రెస్ లపై అక్రమ దందాలు ఆపివేయాలి

**నిజామాబాద్,జూన్ 12(ప్రజాక్షేత్రం):**విద్య సంస్థలు పున:ప్రారంభం అవుతున్న వేళ కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులపై పుస్తకాలు మరియు స్కూల్ యూనిఫాం బుట్లు సాక్షులతో సహా అన్ని కూడా అన్ని స్కూల్ లోనే కొనాలి అని విద్యార్థుల తల్లిదండ్రుల పై ఒత్తిడి పెడుతున్నారు. ప్రభుత్వం స్కూల్ లో పుస్తకాలు అమ్మరదని నోటీసులు జారీచేసిన ఆ నోటీసును విద్యాసంస్థలు మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకవేళ పుస్తకాలు అమ్ముతున్నట్టు దృష్టిలో వచ్చినట్లైతే ఇట్టి విషయాన్ని కలెక్టర్ దృష్టిలో తీసుకెళ్ళి విద్యాసంస్థని సీజ్ చెపించేవరకు ఉద్యమిస్తామని విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ నాయక్ అన్నారు.ఈ సమావేశం లో నాయకులు గంగాధర్,అంజి, సిద్ధు,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి అడ్మిషన్లకై ఇంటింటి ప్రచారం

**ఆర్మూర్,జూన్ 12(ప్రజాక్షేత్రం):** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మన ఊరు మన అంగన్వాడి అనే నినాదంతో 3 నుండి 5 సంవత్సరాల లోపల పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో అడ్మిషన్ చేయుటకై రంగాచారి నగర్, వడ్డెర కాలనీ అంగన్వాడి ఇన్స్పెక్టర్ అరుంధతి, ఆయమ్మ చంద్రకళ, సీడీపీవో భార్గవి,సూపర్వైజర్ నళిని మాట్లాడుతూ ఏ డబ్ల్యు టి ఎస్ వడ్డెర కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఎగ్ బిర్యానీ పాయసం తయారుచేసి పిల్లలకు అందజేయడం జరిగింది. ఇంటింటికి తిరుగుతూ తమ పాఠశాల ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని మా కేంద్రంలో చక్కని ఆటలు, పాటలు ,కథలు ఉచిత తెలుగు,ఇంగ్లీష్ బోధన మానసికాభివృద్ధిని మేధాశక్తిని పెంపొందించి,స్వేచ్ఛ కిడ్స్ కేర్ ని తలపించే అమ్మను మరిపించే అంగన్వాడీ కేంద్రమని,ప్రతిరోజు ఉదయం ఉచిత భోజనం, స్నాక్స్ మరియు ఎగ్స్ ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీలోని తల్లిదండ్రులు ,అడ్మిషన్ పొందబోయే విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పురానీపేట్ గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

**భీంగల్,జూన్ 12(ప్రజాక్షేత్రం):** భీంగల్ మండలంలోని పురనీపేట్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి రెవెన్యూ చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామపంచాయతీ స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకంగా సదస్సులు నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగానే గురువారం పురానీపేట్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో అధికారులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ యువ నాయకులు దైడి సురేష్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. రైతులకు,భూస్వాములకు ఎలాంటి సమస్యలు లేకుండా తమ హక్కులను రిజిస్టరు చేసుకునే అవకాశం ఈ చట్టం కల్పిస్తోందన్నారు. గ్రామస్థాయిలోనే డిజిటల్ రికార్డులు అందుబాటులో ఉండడం ద్వారా నూతన రెవిన్యూ చట్టం పారదర్శకత నిర్వహించబడుతుందన్నారు.ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారికి పిలుపునిచ్చారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ మహమ్మద్ షబ్బీర్, రెవెన్యూ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, దైడి సురేష్,తోట శివ క్రాంతి,సీరం సాగర్,కైరా శ్యామ్,తోట గణేష్, బసిరాబాద్ స్వామి,మల్లెల జనార్దన్,తోట శ్రీనివాస్ కార్యకర్తలు,గ్రామాభివృద్ధి కమిటీ,స్థానిక రైతులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# జూన్ చివరి నాటికి వీ-హబ్ భవనం పూర్తి చేయాలి

- మహిళా శక్తి భవనం నవంబర్ నాటికి పూర్తి చేయాలి
- వీ-హబ్, మహిళా శక్తి భవనం నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి,జూన్ 12(ప్రజాక్షేత్రం):** జూన్ చివరి నాటికి మహిళలకు నైపుణ్య శిక్షణ అందించేందుకు వీహబ్ భవనం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి మండలం రంగంపల్లి లోని వీహబ్,రాఘవ పూర్ గ్రామంలోని మహిళా శక్తి భవనం నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మాట్లాడుతూ, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న వీహబ్ భవనం పనులు జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామీణ మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం నవంబర్ నాటికి మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా మహిళ శక్తి భవనం ప్రారంభించుకోవాలని, ఆ దిశగా ప్రణాళిక బద్ధంగా పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి,జూన్12(ప్రజాక్షేత్రం):** పెద్దపల్లి జిల్లా గ్రంథాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.కలెక్టర్ తనిఖీ సమయంలో గ్రంథాలయంలో ఉన్న పాఠకులతో గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న అన్ని సదుపాయాల గురించి కలెక్టర్ చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేని పక్షంలో వివరాలు అందించాలని, వెంటనే వాటిని తెప్పించి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని, గ్రంథాలయానికి వచ్చే పాఠకుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు.గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చేలా బాగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సొంతింటి కలను నెరవేర్చిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**పెద్దమందడి,జూన్ 12 (ప్రజాక్షేత్రం):** వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పెద్దమందడి మండలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేసి ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి చేశారు.సొంతింటి కలను నెరవేర్చిన ప్రజా ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కార్ కు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి కి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇల్లు లేక ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకుంటే వాళ్ల పార్టీ నాయకులకే ఇచ్చుకున్నారు. తప్ప మాకు ఇల్లు ఇవ్వకపోగా అవమానపరిచారని లబ్ధిదారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,ప్రభుత్వ అధికారులు,కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## గుండెపోటుతో వ్యక్తి మృతి

**వలిగొండ,జూన్ 12(ప్రజాక్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన వలిగొండ మండలంలో జరిగింది.పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా నాగారం శివారులో కారు ఆగి ఉందని ఎస్ఐ యుగేందర్ తెలిపారు. డ్రైవింగ్ సీట్లో ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడని చెప్పారు. అతనికి ఎలాంటి గాయాలు లేవని గుండపోటుతో చనిపోయి ఉంటాడని భావిస్తున్నామని అన్నారు.గుర్తింపు కార్డు ద్వారా అతని ప్రకాశం జిల్లాకు చెందిన బండార్ కృష్ణగా గుర్తించాము అన్నారు.

## కీర్తి ఫౌండేషన్ అద్భుత్ కుమార్ పై చర్యలేవి?

**అనాధాశ్రమం పేరుతో బెగ్గింగ్ మాఫియా**
**వుమన్ & చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సీరియస్**



**విశాఖపట్నం,జూన్ 12(ప్రజాక్షేత్రం):**కీర్తి ఫౌండేషన్ అనేక మోసాలకు పాల్పడుతుందని,తక్షణమే వ్యవస్థాపకులు ఎల్ ఏ అద్భుత కుమార్ పై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మహానగరంలో మాయగాడు, ఇతనికిచదువులేదు ,ఆస్తి లేదు,సమాజంలో పేరు లేదు. కానీ,ఇతడు రెండు రాష్ట్రాల ప్రజలను మోసం చేస్తున్నాడు. కీర్తి ఫౌండేషన్ అనే ఆశ్రమం స్థాపించి సుమారు 8 సంవత్సరముల నుండి ఒక బెగ్గింగ్ మాఫియాను తయారు చేసి 300 మంది పిల్లలను, వాలంటరీలుగా తయారు చేసి వారితో బిక్షమెత్తిస్తున్నారు. చదువు లేని వారు 14 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వృద్ధుల వరకు ప్రతి ఒక్కరిని అతని మాయమాటలతో ఒప్పించి ఈ వృత్తిలోనికి తీసుకువస్తున్నారు.వారిని ఇంటింటికి పంపించి రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాడు.అదే కాకుండా అనాధాశ్రమంలో యువతులను చందాలకు పంపి బట్టలు,డబ్బులు, బియ్యం,నూని తదితర వస్తువుల ను రూపంలో స్వీకరించి వాటిని తన సొంత అవసరాలకువినియోగించుకుంటున్నారు.తల్లితండ్రులేని పిల్లలు అని చెప్పి పేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలను ఒక బెగ్గింగ్ మాఫియాగా తయారుచేసి వారితో బిచ్చమెత్తిస్తున్నాడు. దీనిపై 2023వ సంవత్సరంలో సుమన్ టీవీ ఈ సంస్థ లో జరిగిన అనేక మోసాలను వెలుగులోకి తెచ్చింది. కాకినాడ ప్రాంతంలో ఈ కీర్తి ఫౌండేషన్ పై దొంగతనం నేరం కూడా నమోదయిందని స్థానికుల వాదన.హోమం వుమన్ & చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో కీర్తి ఫౌండేషన్ సంస్థపైనమోదు చేయడం జరిగింది.సంస్థ కార్యాలయానికి సీలు వేశారు. కానీ, ఇప్పటికీ ఆగని దందా మరియు ఇప్పుడు పాడేరు, అరుకు,చింతపల్లి గిరిజన ప్రాంతాల నుండి గిరిజనుల తల్లి,తండ్రి ఉన్న పిల్లలను సుమారు 30 మంది పిల్లలను తీసుకువచ్చి వీరు అనాథలని చెప్పి సోషల్ మీడియా ద్వారా, ఫేస్బుక్ ద్వారా,ఇంస్టాగ్రామ్ ద్వారా పెద్ద మొత్తంలో సొమ్ము అతని ఆన్లైన్ అకౌంట్లోకి ఇప్పుడు కూడా జమ అవుతుంది.ఈ ఆశ్రమంలో ఉన్న యువతులతో కుమార్ అసభ్యకరంగాప్రవర్తించేవాడని కూడా స్థానికులు చెబుతున్నారు.ఈ వ్యవహారంపై అధికారులు కానీ, పోలీసులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. తక్షణమే ఈ సంస్థలో జరిగే అక్రమాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. కీర్తి ఫౌండేషన్ నుండి ఎవరైనా వచ్చి మిమ్మల్ని ఏ విధమైన ఆర్థిక సహాయం అడిగినా తక్షణమే స్థానిక పోలీసులకు సమాచారం అందజేయగలరు.

## వలిగొండలో విద్యార్థుల అవస్థలు

**వలిగొండ,జూన్ 12(ప్రజాక్షేత్రం):**యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండలం లోని 37 గ్రామపంచాయతీలకు కాను ఒకటే ఆధార్ సెంటరు ఉన్నది.ప్రతి పనికి ఆధార ముఖ్యం కావడంతో చాలా ఇబ్బంది పడవలసి వస్తుందని మండల వాసులు కోరుతున్నారు.ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు దోస్త్ అప్లికేషన్స్ చిన్నారులకు ఆధార్ ఇతర పనులకు చాలా ఇబ్బందిగా మారింది.ఈ సమస్యలను తక్షణమే అధికారులు పరిష్కరించాలని విద్యార్థులు ప్రజలు కోరుతున్నారు.





## విమానం ప్రమాదానికి గురి కావడం చాలా బాధాకరం

**కాశపాగ ఇమ్మయ్య సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు**

**సంగారెడ్డి జూన్ 12(ప్రజాక్షేత్రం):**అయన మాట్లాడుతు గుజరాత్ అహ్మదాబాద్ లో ఈ రోజు జరిగిన గోర విమాన ప్రమాదం చాలా దిగ్భ్రాంతి కి గురి చేసిందని ప్రమాదం లో మరణించిన మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని వారి కుటుంబాలకు భగవంతుడు శక్తి ఓదార్పు ప్రసాదించాలని కోరుతున్నాను.ప్రమాదంలో 169 మంది భారతీయులు, 53 మంది ఇంగ్లాండ్ పౌరులు, 7 మంది పోర్చుగల్ పౌరులు, 1 కెనడియన్ పౌరుడు, 12 మంది విమాన సిబ్బంది మృతి చెందారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఘటన పై కేంద్రం తక్షణమే చర్యలు తీసుకొని బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలనీ కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్త్రీనిధి లోన్లు అందజేత

**భీంగల్,జూన్ 12(ప్రజాక్షేత్రం):**

భీంగల్ మండలంలోని మెండోరా గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరా క్రాంతి పదం ఆధ్వర్యంలో స్త్రీనిధి పథకం ద్వారా ఒక్కొక్కరికి 40 వేల రూపాయలు చొప్పున ఇద్దరు లబ్ధిదారులకు 80 వేల రూపాయలు అందజేయడం జరిగిందని ఎంపీడీవో సంతోష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదార్లు ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక సాయం కొరకు మీ గ్రామ సీసీలను గాని,వివో ని గాని సంప్రదించి స్త్రీనిధి కింద లోన్ తీసుకొని నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించడానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం రవీందర్,సీసీలు శ్రీనివాస్, నరేష్,పిఎస్ ప్రశాంత్,వివో అధ్యక్షురాలుహర్షిని,గ్రామ నాయకులు రమేష్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# వైద్య ఖర్చులకు వాసుపల్లి రూ.10 వేలు ఆర్థిక సాయం

- పేదల పాలిట మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్ ఆపన్న హస్తం
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు,దక్షిణ వైసీపీ క్యాడర్

**విశాఖపట్నం,జూన్ 12(ప్రజాక్షేత్రం):** పేదల పాలిట ఆత్మబంధువుగా నిలిచే మాజీ ఎమ్మెల్యే దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఓ పేద మహిళ వైద్యానికి రూ.10,000 ఆర్థిక సాయం చేసి మరోసారి తన సహృదయాన్ని చాటుకున్నారు. ఆశీలమెట్ట కార్యాలయంలో గురువారం తన సొంత నిధులతో పదివేల నగదును ఆమె బంధువు నక్కరాజు హరికి అందజేశారు. వేటాల నూకలు అనే ఓ పేద మహిళకు గర్భాశయ సమస్యతో కంచరపాలెం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. మెడిసిన్ ఖర్చులకు వాసుపల్లిని సహాయం కోరగా తక్షణమే స్పందించి ఆర్థిక సాయం చేశారు. ఆయన అందిస్తున్న సహాయ సహకారం పట్ల బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పెరిగిన ధరలతో జీవనమే కష్టంగా ఉన్న పేదలకు ఆరోగ్య పరమైన సమస్యలను ఎదుర్కోవడం ఉన్న తాకట్టు పెట్టిన సరిపోవు అన్నారు. అటువంటి పేదల గుండె చప్పుడును విన్న డాక్టర్ రాజశేఖర్ ఆరోగ్యశ్రీ నీ ప్రవేశ పెడితే దానిని రెట్టింపు చేసి జగన్మోహన్ రెడ్డి కార్పొరేట్ వైద్యాన్ని పేదలకు అందించారన్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలో ఉన్న సమయంలో జీవన భృతిని అందజేసి ఆ పేద కుటుంబాలకు పెద్దన్నగా నిలిచారన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం పేదలకి జగనన్న అందించిన సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. పేదవాడికి విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించలేని చంద్రబాబు ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, సౌత్ ఆర్ టి ఐ అధ్యక్షుడు బాపు ఆనంద్, సౌత్ బూత్ కమిటీ ప్రెసిడెంట్, 39వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, సౌత్ వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ప్రెసిడెంట్ బేవర మహేష్, దక్షిణ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్, గనగళ్ల రామరాజు తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఠాణాలకు అధికారుల నియామకం..!

- పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గా పురుషోత్తం
- ఎలిగేడు మండల పోలీస్ స్టేషన్ ఎస్సై గా సత్యనారాయణ
- పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై గా మల్లేశం

**పెద్దపల్లి,జూన్ 12(ప్రజాక్షేత్రం):** నూతనంగా మంజూరైన పోలీస్ స్టేషన్ లకు అధికారులను కేటాయిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.నూతనంగా మంజూరైన పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గా పురుషోత్తం ను నియమిస్తూ ఉత్తర్వులు వెల్లడించారు. పెద్దపల్లి రూరల్ ఎస్ఐగా మల్లేశ్ ను నియమించారు. నూతనంగా మంజూరైన ఎలిగేడు పోలీస్ స్టేషన్ ఎస్సైగా సత్యనారాయణను నియమించారు. పురుషోత్తం ప్రస్తుతం రామగుండం ఎస్ బి లో పనిచేస్తున్నారు.రూరల్ ఎస్ఐగా నియమితులైన మల్లేశ్ ప్రస్తుతం పెద్దపల్లి ఠాణాలో ఎస్ఐ 2గా పని చేస్తున్నారు.ఎలిగేడు ఎస్ఐగా నియమితులైన సత్యనారాయణ ప్రస్తుతం మంచిర్యాల వీఆర్ లో ఉన్నారు.ఈ మూడు పోలీస్ స్టేషన్లలో శుక్రవారం రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ప్రారంభోత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది

- ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా ఉండాలని భగవంతుడుని ప్రార్థిస్తున్నా
- రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్



**అనకాపల్లి,జూన్ 12(ప్రజాక్షేత్రం):** అహ్మదాబాద్ లో చోటు చేసుకున్న విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది అని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ తెలిపారు.242 మందితో లండన్ బయలుదేరిన విమానం - టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోవడం అనే వార్త ఎంతగానో ఆవేదనకు గురిచేసింది అని విచారం వ్యక్తం చేశారు.విమానం వైద్య కళాశాల వసతి భవనాలపై కూలడంతో మహా ప్రమాదం జరిగిందిఅన్నారు.పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో ప్రధాని నరేంద్ర మోదీ గారు ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు అన్నారు. విమాన ప్రమాదంలో పెద్దసంఖ్యలో ప్రయాణికులు మృతి చెందడంపై విచారం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు .ఈ దుర్ఘటనలో మృతులకు దేశం బాసటగా ఉండాల్సిన అవసరం ఉంది అని బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా భారత ప్రభుత్వం ఆదుకుంటుంది అని తెలియజేశారు.



## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ


**మాక్లూర్,జూన్ 12(ప్రజాక్షేత్రం):**

మాక్లూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మొదటి రోజు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్ అందజేశారు.ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకుధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని,విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి ,ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్**

**భీంగల్,జూన్ 12(ప్రజాక్షేత్రం):** భీంగల్ మండలంలోని మెండోరా, బాబానగర్ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం రోజు నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఏకరూప దుస్తులు,నూతన పాఠ్యపుస్తకాలు అందజేయడం జరిగింది .ఈ సందర్భంగా ఎంపీడీవో సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని గ్రామాల్లో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరడం జరిగింది.ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు,మధ్యాహ్న భోజనం అమలు చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం ఇ ఓ డి.స్వామి,ఏపీఎం రవీందర్,సీసీలు శ్రీనివాస్ నరేష్ ,లలిత,నాయకులు రమేష్ శేఖర్,రాజేందర్,ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## చింతలపూడి లో మిడ్ డే మిల్స్ ని పరిశీలించిన తహసిల్దార్ ప్రేమ ద్వర

**ఏలూరు జిల్లా జూన్ 12 (ప్రజాక్షేత్రం):** చింతలపూడి మండలంలో మిడ్ డే , మీల్స్ ని చింతలపూడి మండల తహసిల్దార్ ప్రమద్వర పరిశీలించి,విద్యార్థిని విద్యార్థుల తో ముచ్చటించి,ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.



## విమాన ప్రమాద ఘటన దురదృష్టకరం.

- విమానం మెడికల్ కళాశాలపై దూసుకు వెళ్లడం మరింత బాధను కలిగించింది
- చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జ్ పామెన భీమ్ భరత్



**చేవెళ్ల జూన్ 12(ప్రజాక్షేత్రం):** అహ్మదాబాద్ లో కూలిన విమానం సంఘటన అత్యంత దిగ్భ్రాంతికరమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు భీమ్ భరత్ ఆవేదన వ్యక్తం చేశారు. అహ్మదాబాద్‌లో 242 మందితో కూడిన ఎయిర్ ఇండియా విమానం బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ (విమానం ఏ1171) 232 మంది ప్రయాణికులతో బయలుదేరిందని, 5 నిముషాల లో వీరి విమానం కూలిపోడం దురదృష్టకమైన సంఘటనని వీరిలో 10 మంది సిబ్బంది ఉన్నారని మొత్తం 242 మంది మృత్యువాత పడ్డారని చెప్పారు. విమానంలో సాంకేతిక లోపాలతో ఈ ప్రమాద ఘటన జరిగి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. విమానం మెడికల్ కళాశాలపై దూసుకు వెళ్లడం మరింత బాధను కలిగించిందని 20 మంది మెడికోలు మృత్యువాత పడడం చాల దురదృష్టకరమైన ఘటన అని ఆయన అన్నారు. చనిపోయిన విమాన ప్రయాణికులతోపాటు మృతి చెందిన మెడికోలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

## అహ్మదాబాద్ లో విమానం కుప్పకూలిన ఘటన చాలా బాధాకరం

- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ




**హైదరాబాద్ జూన్ 12(ప్రజాక్షేత్రం):** గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదవశాత్తు కుప్పకూలిపోయిన ఘోరమైన ఘటన దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాలిలోకి ఎగిరిన విమానం అతి కొద్ది నిమిషాల వ్యవధిలోనే ఘోరంగా ప్రమాదానికి గురి కావడం అత్యంత విచారకరం. విమానం కుప్పకూలిన మెడికల్ కాలేజి ఆవరణలో ఉన్న దారుణ పరిస్థితిని చూస్తుంటే ప్రతి ఒక్కరి హృదయం తీవ్రంగా కలచి వేస్తుంది. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణం చేస్తున్న వారిలో ఒకరు మినహా మిగతా వారంతా మృతి చెందడం అత్యంత విచారకరం. వారికి నివాళులు తెలుపుతున్నాం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాం. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో వైద్య విద్యార్థులు కూడా ప్రమాదబారినపడడం విచారకరం. ఈ ప్రమాదంలో గాయాలపాలైన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. ఈ ప్రమాదం ఏ నిర్లక్ష్యం వల్ల జరిగిందో, ఇందులో ఏ లోపం ఉన్నదో, ఈ ఘటనకు కారణం ఏమిటో మొదలగు అన్ని విషయాల మీద కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపించాలి. ఈ ఘటనకు పూర్తి బాధ్యత టాటా గ్రూపు కంపెనీ బాధ్యత వహించాలి. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరుపున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. గాయపడిన వారిని కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతున్నాం. ఇలాంటి ఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంద కృష్ణ మాదిగ అన్నారు.




## ఆంధ్ర రాష్ట్ర కూటమి సుపరిపాలనకు ఏడాది పూర్తి


- ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర పాలన
- అదే స్ఫూర్తితో విశాఖ నగర అభివృద్ధి.
- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

**విశాఖపట్నం,జూన్ 12(ప్రజాక్షేత్రం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు ఏడాది కాలం పూర్తి అయిందని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర పరిపాలన చేస్తుందని , అదే స్ఫూర్తితో విశాఖ నగర అభివృద్ధి జరుగుతున్నదని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు.గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా బిజెపి ,జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లతో కలసి కేక్ ను కట్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్ర రాష్ట్ర కూటమి సుపరిపాలన కు ఏడాది పూర్తయిందని ,అందుకు రాష్ట్ర ప్రజలు ఓట్లతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన సందర్భంగా ఎంతో సంతోషంగా వేడుకలు జరుపుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే వృద్ధులకు 4000 దివ్యాంగులకు 6000 రూపాయలు పింఛన్లను పెంచారని, గత ప్రభుత్వంలో మూసేసిన అన్న క్యాంటీన్లను ను తెరిచి ఎంతో మంది పేద ప్రజలకు 5 రూపాయలకే కడుపునిండా ఆహారాన్ని పెడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కొల్లగొట్టినప్పటికీ అన్ని సంక్షేమ పథకాలతో పాటు ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తుందని తెలిపారు. అందులో భాగంగా నేడు తల్లికి వందనం ప్రారంభించారని, ఇప్పటికే దీపం పథకం అమల్లోకి తీసుకొచ్చారని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులకు వేట నిషేధిత కాలంలో నిరుద్యోగ భృతి కు శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ విశాఖను ఆర్థిక రాజధానిగా నెలకొల్పేందుకు అనేక ఐటీ పరిశ్రమలు ఈ రాష్ట్రానికి తీసుకు వస్తున్నారని, వైయస్సార్సీపి నాయకులు రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారని అది రెడ్ బుక్కు కాదని ప్రజా పాలన బుక్ అని తెలుసుకోవాలన్నారు. అదే స్ఫూర్తితో విశాఖ నగర అభివృద్ధి దిశగా మేయర్ గా నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నానని, అవసరమైన మౌలిక సదుపాయాలు ప్రజలకు కల్పించడానికి ప్రణాళికలు చేపడుతున్నానని, ప్రజా సంక్షేమమే దిశగా జీవీఎంసీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని, విశాఖ నగరంలో ప్రజాప్రతినిధులు, వార్డు కార్పొరేటర్లు సహకారంతో విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు చేపడుతున్నామని మేయర్ ఈ సందర్భంగా తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచానికి యోగాను పరిచయం చేసి 10 సంవత్సరాల పూర్తయి 11వ ఏట అడుగుపెడుతున్న సందర్భంగా విశాఖపట్నంలో 5 లక్షల మందితో యోగా కార్యక్రమాలను 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం అయిన జూన్ 21న నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డు తోపాటు చరిత్రను ఈ విశాఖ నగరం సృష్టిస్తుందన్నారు. అందుకు విశాఖ నగర ప్రజలందరూ యోగాంధ్ర 2025 కార్యక్రమాలు పాల్గొని యోగా దినోత్సవం జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ బీశెట్టి వసంతలక్ష్మి, బిజెపి పార్టీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత, పలువురు కూటమి కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ కు ఘన సన్మానం

**ఆర్మూర్,జూన్12 (ప్రజాక్షేత్రం):** ఇటీవలే నావనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికల్లో గెలుపొందిన సంజీవ్ పార్దేమ్ కు గురువారం హరిపూర్ (పల్లె) విలేజ్ డెవలప్మెంట్ కమిటీ, రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా వి డి సి అధ్యక్షుడు బీరయ్య. రామాలయ కమిటీ అధ్యక్షుడు నర్సయ్య లు మాట్లాడుతూ మా గ్రామ వ్యక్తికి ఇంత పెద్ద పదవి వరించడంతో మాకెంతో సంతోషం ఉందని వారు ఇకముందు ముందు ఎన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని వారు తెలిపారు.అలాగే మాజీ ఎంపీటీసీ ఎలక రంజిత్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సమాచారం చేరవేస్తూ నిజాన్ని నిర్భయంగా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడమే జర్నలిస్టుల పని అని వారు అభినందించారు ప్రజలను చైతన్యం చేసే విధంగా వార్తలు రాయాలన్నారు.అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సంజీవ్ పార్దేమ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై తమ కలం ఎప్పుడు ప్రశ్నించే గొంతుకలాగానే ఉంటుందని. తమ పనులను పక్కనపెట్టి నాకు ఇంత పెద్ద గొప్ప సన్మానం చేసి నేను పుట్టిన గ్రామంలో జరిపించడం నాకు ఎంతో సంతోషం కలిగించిందని అలాగే రామాలయ కమిటీ సభ్యులకు వి డి సి సభ్యులకు గ్రామంలోనున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎల్క రంజిత్. కార్యదర్శి అంకమల్ల శంకర్.కోశాధికారి బిల్డర్ శంకర్. చిగుర్ల మల్లేష్. సుంకపాక రాజేశ్వర్. మాజీ వార్డు మెంబర్ రాజా గౌడ్. సాయ గౌడ్. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామ్సన్. ఆలయ కమిటీ కోశాధికారి కపిల్ గౌడ్.సత్తయ్య.లింబద్రి గౌడ్. సుంకపక రవి. నితిన్ రాజ్. రాగం నరేష్. గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.





# పెళ్లి పీటలు ఎక్కబోతున్న 'చిన్నారి పెళ్లి కూతురు'

"చిన్నారి పెళ్లి కూతురు" గా గుర్తింపు పొందిన హీరోయిన్ అవికా గోర్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కనుంది. గత ఆరేళ్లుగా వ్యాపారవేత్త, ఎంటీవీ రోడీస్ రియల్ హీరోస్ మాజీ పోటీదారు మిలింద్ చాంద్వానితో ప్రేమలో ఉన్న అవికా.. తాజాగా తన నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఒక ఫోటోలో అవికా లేత గులాబీ రంగు చీరలో అద్భుతంగా కనిపిస్తూ, మిలింద్ చెంపపై ముద్దు పెడుతూ సంతోషంగా కనిపించింది.అవికా గోర్ 'బాలికా వధు' సీరియల్‌తో బాలనటిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టి, ఆనంది పాత్రతో గుర్తింపు పొందింది. ఆ తర్వాత 'ససురాల్ సిమర్ కా', 'లాడో' వంటి సీరియల్స్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ సినిమాల్లో నటించింది. 2013లో 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగుపెట్టింది. ప్రస్తుతం ఆమె హిందీ, తెలుగు సినిమాల్లో బిజీగా ఉంది.

# నేనే తప్పు చేయలేదు..

ఫోక్ సింగర్ మంగ్లీ బర్త్‌డే పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పార్టీలో బిగ్ బాస్ బ్యూటీ దివి పేరు కూడా వినిపిస్తోంది. ఈ క్రమంలోనే మంగ్లీ బర్త్‌డే పార్టీపై దివి వాయిస్ నోట్ ఒకటి విడుదల చేసింది. మీడియా మిత్రులకు చిన్న రిక్వెస్ట్ , ఇప్పుడు ఫ్రెండ్ బర్త్ డే పార్టీ అని వెళితే మనం అక్కడ ఏం జరిగితే ఆ తప్పులు అన్నీ మన మీద తోయడం కాదు కదండీ. మీరు కూడా ఒకసారి చుడండి. చూసి దాన్ని బట్టి నిజంగా ఏమైనా ప్రూఫ్స్ ఉంటే నేను ఏదైనా మిస్టేక్ చేసానని ప్రూవ్ అయితే నా ఫోటో వేస్తే బాగుంటుంది. కానీ ఎలాంటి ప్రూఫ్ లు లేకుండా మీరు నా ఫోటో యూజ్ చేస్తే ఇలా నెగటివ్ గా చేస్తే నా కెరీర్ కి ఎంత ఇబ్బంది. నేను ఎంతో కష్టోపడి ఈస్థాయికి అచ్చాను. ఎవరైనా ఫ్రెండ్ అంటే పార్టీకి పిలిస్తే వెళ్లాను. ఆమె మంచిదే కదా, అందుకే వెళ్లాను. నేను బర్త్ డే పార్టీకి వెళితే అక్కడ తప్పులు నామీద వేయడం ఎంతవరకు కరెక్ట్? దయచేసి నా ఫోటోలు వాడకండి, నాకు ఇబ్బంది అవుతుంది అని దివి చెప్పుకొచ్చింది.



# బన్నీ స్టోరీతో ఎన్టీఆర్ మూవీ..


తెలుగు సినిమా పరిశ్రమలో మాటల మాంత్రికుడిగా పేరొందిన దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో కలిసి మరో భారీ ప్రాజెక్ట్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కథాంశంతో మైథాలజీ జోనర్‌లో రూపొందనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. గీతా ఆర్ట్స్, హారికా హాసిని క్రియేషన్స్ బ్యానర్లపై నిర్మాణం జరగనున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.అయితే ఊహించని విధంగా అల్లు అర్జున్ ఈ సినిమాని పక్కనపెట్టి, బాలీవుడ్ దర్శకుడు అట్లీతో కొత్త సినిమాని ప్రారంభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్ మైథాలజీ సినిమా నుంచి అల్లు అర్జున్ తప్పుకున్నారనే వార్త వైరల్‌గా మారింది. ఈ పరిణామం త్రివిక్రమ్ అభిమానులను నిరాశ పరిచినప్పటికీ, ఇప్పుడు ఒక కొత్త అప్‌డేట్ ఫిల్మ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం త్రివిక్రమ్ ఈ మైథాలజీ సినిమా కథను యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై నిర్మాత నాగవంశీ ఓ ట్వీట్ ద్వారా క్లారిటీ ఇచ్చాడు. తన ట్వీట్‌లో.. "నా ఫేవరేట్ హీరో మోస్ట్ పవ





# డైరెక్టర్‌కు బాలయ్య స్ట్రాంగ్ వార్నింగ్

బాలయ్య బాబుకు కోపం వస్తే ఎలా ఉంటుంది అందరికీ తెలుసు. ఇండస్ట్రీలోని వారికే కాదు.. తెలుగు చిత్ర ప్రేక్షకులకు కూడా బాగా అవగతమే. అందులోనూ ఏదైనా తప్ప జరుగుతుంటే బాలయ్య అస్సలు చూస్తూ ఊరుకోరు. అవతల ఎవరున్నా దుమ్ముదులిపేస్తారు. ఎన్టీఆర్ 'శ్రీనాథకవిసార్వభౌమ' మూవీ షూటింగ్ రామకృష్ణ స్టూడియోలో జరుగుతున్నరోజులు.. తండ్రి సినిమా అందులోను చారిత్రాత్మకం కావడంతో ఆసక్తిగా షూటింగ్ కి వీలున్నప్పడల్లా వచ్చేవాడు బాలయ్య.. అదే స్టూడియోలో ఇంకోసెట్లో 'జంతర్ మంతర్' మూవీ షూటింగ్ కూడా జరుగుతుంది.. ఒకరోజు సాయంత్రం తండ్రి సినిమా షూటింగ్ చూడటానికి వచ్చిన బాలయ్య.. 'జంతర్ మంతర్' షూటింగ్ జరుగుతున్న సెట్ పక్కగా వెళ్తుండగా, ఒక చిన్నకుర్రోడు లైట్ పట్టుకుని కనిపించాడు. ఎంతసేపట్నుంచి పట్టుకుని ఉన్నాడో దాని బరువు మోయలేక అలసిపోయి కళ్ళు తిరిగి పడిపోయేలా కనిపించాడు. షాట్ మధ్యలో ఉంది.. వెంటనే బాలయ్య వేగంగా వెళ్ళి పడిపోబోతున్న కుర్రోడిని పక్కకి జరిపి షాట్ పూర్తయ్యేదాకా



# రజనీకాంత్ 'కూలీ' మూవీ..

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న సినిమా 'కూలీ' తెలుగు థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్‌లో గట్టి పోటీ నెలకొంది. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతుంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్ టాప్ డిస్ట్రిబ్యూటర్లు పోటీపడుతున్నారు. ఈ సినిమా తెలుగు రైట్స్‌ను సొంతం చేసుకునేందుకు దిల్ రాజు, ఆసియన్ సునీల్ నారంగ్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత ఎస్. నాగవంశీ, అన్నపూర్ణ స్టూడియోస్ వంటి ప్రముఖులు రంగంలో ఉన్నారు. ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్న అక్కినేని నాగార్జున కూడా అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా రైట్స్ కోసం ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. ఇంతటి పోటీ నడుస్తున్న నేపథ్యంలో సినిమా నిర్మాతలు తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ కోసం రూ. 45 కోట్ల భారీ ధరను డిమాండ్ చేస్తున్నారని ఫిల్మ్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోందిరజనీకాంత్ 'జైలర్' సినిమా తెలుగు రాష్ట్రాల్లో రూ. 48 కోట్ల నెట్ కలెక్షన్లతో సంచలన విజయం సాధించింది. ఈ క్రమంలో 'కూలీ'పై కూడా తెలుగు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. లోకేష్ కనకరాజ్ గత సినిమాలు 'విక్రమ్', 'లియో' వంటివి తెలుగులో మంచి ఆదరణ పొందడంతో, 'కూలీ' కూడా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అన్నపూర్ణ స్టూడియోస్ ఈ రైట్స్‌ను దక్కించుకునే దిశగా ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది, అయితే అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.ఈ సినిమా ఆగస్ట్ 14న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది.

# ఆగిపోయిన ప్రేమలు సీక్వెల్ ..

విజయాన్ని అందుకుంది. నస్లేన్ కె. గఫూర్, మమితా బైజు జంటగా నటించిన ఈ సినిమాకు గిరీష్ ఏడీ దర్శకత్వం వహించాడు. అందుతున్న సమాచారం ప్రకారం ప్రేమలు 2 ఆగిపోయిందని సమాచారం. హీరోగా నటించిన నస్లేన్ కె. గఫూర్ కు సీక్వెల్ ఫైనల్ వెర్షన్ నచ్చలేదని, దాంతో పాటు వేరే సినిమాలు కూడా చేస్తుండడంతో డేట్స్ అడ్జెస్ట్ చేయలేక అతని ఈ సినిమా నుంచి తప్పుకున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రేమలు సినిమాకు హైలైట్ అంటేనే నస్లేన్ యాక్టింగ్. సచిన్ పాత్రలో అతని నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ఇప్పుడు సీక్వెల్ లో అతను లేకపోతే.. అసలు ప్రేమలు 2 తీసి వేస్ట్ అనేది కొందరి భావన. పోనీ, కొత్త హీరోతో తెరకెక్కిస్తే... మొదటి పార్ట్ హీరోతో కంపేర్ చేస్తూ ట్రోల్ చేస్తారు. అందుకే బాగా ఆలోచించి మేకర్స్ ఈ సినిమాను మధ్యలో ఆపేశారని సమాచారం. ఇంకోపక్క మాలీవుడ్ మీడియా.. ప్రేమలు 2 కు బ్రేక్ మాత్రమే పడిందని, పూర్తిగా ఆగిపోలేదని చెప్పుకొస్తుంది. ప్రస్తుతం డైరెక్టర్ కొత్త వెర్షన్ ను రాసే పనిలో ఉన్నాడని, అది పూర్తి అయ్యాక మళ్లీ ఈ సినిమా పట్టాలెక్కుతోందని అంటున్నారు. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR.
Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330